



# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక





సంపుటి: 4 సంచిక: 347, పేజీలు - 08

ఆదివారం, మే 11, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

# భారత్-పాక్ కాల్పుల విరమణ

**- అధికారంగా ప్రకటించిన భారత్**

- స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 5 గంటల నుంచి అమలు
- భూమి, గగనతలం, సముద్ర మార్గాల్లో కాల్పులు, సైనిక చర్యల నిలిపివేత
- ఇరు దేశాల డీజీఎంఓల మధ్య కుదిరిన అంగీకారం
- మే 12న మరోసారి చర్చలు జరిపే అవకాశం



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** గత కొన్నిరోజులుగా భారత్, పాకిస్తాన్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతలకు తాత్కాలికంగా తెరపడింది. రెండు దేశాల మధ్య జరిగిన చర్చల తర్వాత భారత్, పాకిస్తాన్ కాల్పుల విరమణకు అంగీకరించినట్లు శనివారం కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. దీనికి సంబంధించి పాకిస్తాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) శనివారం మధ్యాహ్నం భారత డీజీఎంఓకు ఫోన్ చేసినట్లు భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ స్పష్టం చేశారు. ఆ తర్వాత రెండు దేశాలకు చెందిన ఉన్నతాధికారులు చర్చలు జరిపి కాల్పుల విరమణకు ఓకే చెప్పినట్లు తెలిపారు. ఈ చర్చల తర్వాత నేవీ, ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ.. త్రివిధ దళాలు తమ దాడులను తక్షణమే నిలిపివేయాలని ఒక అవగాహనకు వచ్చినట్లు వెల్లడించారు. శనివారం మధ్యాహ్నం 3:35 గంటలకు పాకిస్తాన్ డీజీఎంఓ, భారత డీజీఎంఓకు ఫోన్ చేశారని విక్రమ్ మిస్లీ తెలిపారు. భారత కాలమానం ప్రకారం సాయంత్రం 5 గంటల నుంచి రెండు దేశాల మధ్య అన్ని రకాల కాల్పుల విరమణ పాటించాలని భారత్, పాకిస్తాన్ దేశాలు అంగీకరించినట్లు వెల్లడించారు. భూమి నుంచి గగనతలం నుంచి సముద్రం నుంచి చేసే అన్ని రకాల కాల్పులు, సైనిక చర్యలను నిలిపివేయాలని రెండు దేశాలు అంగీకారానికి వచ్చినట్లు తెలిపారు. ఈ చర్చలకు అనుగుణంగా రెండు దేశాలు తమ సైన్యానికి ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అయితే రెండు దేశాలకు సంబంధించిన ఉన్నతాధికారులు మే 12వ తేదీ(సోమవారం) రోజున మధ్యాహ్నం 12 గంటలకు మరోసారి మాట్లాడుకుంటారని విక్రమ్ మిస్రీ తెలిపారు. కాల్పుల విరమణకు సంబంధించి ఇతర అంశాలపై లేదా ఇతర వేదికలపై చర్చలు జరిపేందుకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. మరోవైపు భారత్‌తో కాల్పుల విరమణ అంగీకారానికి సంబంధించిన విషయాన్ని పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ కూడా ధృవీకరించారు. భారత్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్లు వెల్లడించారు.

# ఇప్పటికి ఆపాం..
# తేడా వస్తే ఊరుకోం

**- పాక్ కు భారత్ స్ట్రాంగ్ వార్నింగ్**

**- పాకిస్థాన్ తప్పుడు ప్రచారం చేస్తోంది అంటున్న భారత అధికారులు**

**- మతపరమైన ప్రదేశాలపై దాడులు చేయలేదన్న వింగ్ కమాండర్**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత్, పాక్ మధ్య శనివారం జరిగిన కాల్పుల విరమణ ఒప్పందానికి తాము కట్టుబడి ఉంటామని, అయితే ఉల్లంఘనలకు పాల్పడి కవ్వింపు చర్యలకు దిగితే మాత్రం దీటుగా ప్రతిస్పందన ఉంటుందని సైన్యం ప్రకటించింది. ఈ మేరకు కమొడోర్ రఘు నాయర్ పొరుగు దేశానికి కీలక హెచ్చరికలు చేశారు. కాల్పుల విరమణకు అంగీకరించినా తాము మాత్రం పూర్తి సన్నద్ధంగా ఉంటామని, అప్రమత్తంగా ఉంటామని తెలిపారు. భవిష్యత్తులో పాకిస్తాన్ నుండి ఏదైనా ఉద్రిక్తత తలెత్తితే మాత్రం భారత సాయుధ దళాలు నిర్ణయాత్మక ప్రతిస్పందనకు సిద్ధంగా ఉన్నట్లు కమొడోర్ రఘు నాయర్ తెలిపారు. మాతృభూమి సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడటానికి కట్టుబడి ఉన్నట్లు ఆయన వెల్లడించారు. పాకిస్తాన్ చేసే ప్రతి దుస్సాహసాన్ని అడ్డుకున్నామని, భవిష్యత్తులో జరిగే ప్రతి దాడీ తమ నుంచి నిర్ణయాత్మక ప్రతిస్పందనకు కారణమవుతుందని ఆయన తెలిపారు. దేశ రక్షణ కోసం అవసరమైన ఏవైనా కార్యకలాపాలను ప్రారంభించడానికి తాము పూర్తిగా కార్యాచరణపరంగా సిద్ధంగా ఉన్నామన్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత, భారతదేశం యొక్క ప్రతిస్పందన చాలా కచ్చితత్వంతో, చాలా బాధ్యతాయుతంగా" చేపట్టామని కమోడోర్ నాయర్ తెలిపారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ తప్పుడు సమాచారం వ్యాప్తిని ఆయన తప్పుబట్టారు. పాకిస్తాన్ తన జేఎఫ్-17 విమానం, భారతదేశ ఎస్-400 వైమానిక రక్షణ వ్యవస్థ, బ్రహ్మోస్ క్షిపణి స్థావరంపై దాడి జరిగినట్లు చేస్తున్న ప్రచారం అంతా ఫేక్ అని కల్నల్ సోఫియా ఖురేషీ తెలిపారు. భారత వైమానిక స్థావరాలు, మందుగుండు సామగ్రి నిల్వలను దెబ్బతీశారనే పాకిస్తాన్ వాదనలను కూడా ఆమె తోసిపుచ్చారు.

## తెలంగాణ సహా 8 రాష్ట్రాలతో ఆపరేషన్ చక్ర-V

**- సైబర్ నేరగాళ్ల అరెస్టు**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టు వంటి కేసులను నివారించడానికి కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) మరో కీలక చర్య తీసుకుంది. ఆపరేషన్ చక్ర-V కింద, దేశవ్యాప్తంగా 8 రాష్ట్రాల్లో సీబీఐ ఏకకాలంలో దాడులు నిర్వహించింది. 5 మంది కీలక వ్యక్తులను అరెస్టు

2లో..

## ఎడారిగా మారుతున్న మూసీ ప్రాజెక్టు.?

**- శిథిలావస్థ దిశగా మూసీ**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** నాగార్జునసాగర్ ప్రాజెక్టు తర్వాత ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండో అతిపెద్ద ప్రాజెక్టు మూసీకి ముప్పు పొంచి ఉంది. ఓవైపు మూసీ జలాశయానికి పూడిక ముప్పు ముంచుకొస్తుండగా మరోవైపు జలాశయ నీటి సామర్థ్యం తగ్గి ఆయకట్టు విస్తీర్ణం తగ్గిపోయింది. ఉమ్మడి పాలకులకు తోడు గత బీఆర్ఎస్ సర్కారు నిర్లక్ష్యం పుణ్యమంటూ మూసీ ప్రాజెక్టు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యింది. పలుమార్లు ప్రాజెక్టు గేట్లు వరద నీటికి కొట్టుకుపోయిన నీరంతా సముద్రం పాలయ్యింది. 42వేల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన మూసీ ప్రాజెక్టు నేడు శిథిలావస్థకు చేరుకుంటోంది. ఏటా వరద నీటికి భారీగా మట్టి వచ్చి ప్రాజెక్టులోకి చేరుతోంది. ఇటీవల కేంద్ర జలసంఘం నిర్వహించిన సర్వేలోనూ మూసీ ప్రాజెక్టు 15 శాతానికి పైగా పూడిపోయినట్టు నివేదికతో సహా బహిర్గతం చేసింది. నిజానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా నిండా ఉద్దండ నేతలే ఉన్నా మూసీ ప్రాజెక్టుపై మాత్రం శీతకన్ను వీడడం లేదు. మరోవైపు ప్రాజెక్టులో నీటి సామర్థ్యం తగ్గి రైతాంగం భారీగా నష్టపోతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. మూసీ ప్రాజెక్టు నిర్మాణంలో అప్పట్లో మంచి టెక్నాలజీ వినియోగించారు. ప్రాజె క్టుకు గేట్ల కింది భాగంలో 10 స్కవర్ గేట్లను ఏర్పాటు చేశారు. వరద నీటిరూపంలో

2లో..

## మాట తప్పిన పాకిస్తాన్ ఆర్మీ

**- సరిహద్దుల్లో మళ్లీ డ్రోన్ దాడులు**

**- కశ్మీర్ సీఎం ధృవీకరణ**



**శ్రీనగర్ (ప్రశ్న న్యూస్)** కాల్పుల విరమణకు అంగీకరించిన కొద్ది గంటల్లోనే పాకిస్థాన్ తన వక్రబుద్ధిని మరోసారి ప్రదర్శించినట్లు తెలుస్తోంది. జమ్మూకశ్మీర్‌తో పాటు పలు సరిహద్దు రాష్ట్రాలపై డ్రోన్ల ద్వారా దాడులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలతో సరిహద్దు ప్రాంతాల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శనివారం రాత్రి అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ వెంబడి పలు భారత భూభాగాలపై పాకిస్థాన్ దాడులకు తెగబడినట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్, ఉధంపుర్‌లలో భారీ శబ్దాలు వినిపించాయని స్థానికులు చెబుతున్నారు. శ్రీనగర్‌లో భారీ శబ్దాలు వినిపిస్తున్నాయని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి

2లో..

## భారత్-పాక్ కాల్పుల విరమణ శుభపరిణామం

**- చంద్రబాబు కీలక వ్యాఖ్యలు**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ జోరుగా సాగిపోతున్న వేళ ఇవాళ హఠాత్తుగా పాకిస్తాన్ వెనక్కి తగ్గడంతో ఇరు దేశాలూ కాల్పుల విరమణ ప్రకటించాయి. అంతే కాదు తక్షణం దీన్ని అమల్లోకి కూడా తెచ్చేశాయి. సాయంత్రం 5 గంటల నుంచే ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. దీనిపై ఎన్డీయే కీలక భాగస్వామి అయిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పందించారు. భారత్-పాక్ యుద్ధ కాల్పుల విరమణపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయవాడ రాజ్ భవన్ కు వచ్చిన సందర్బంగా స్పందించారు. తాము కాల్పుల విరమణను స్వాగతిస్తున్నామని, ఇది సానుకూల ఫలితమని ఆయన తెలిపారు. పాకిస్తాన్ అభ్యర్థన మేరకు

2లో..

## ఏ ఉగ్రదాడి అయినా ఇక యుద్ధ చర్యే

2లో..

**- కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం**



## యుద్ధం ఎవరూ కోరుకోరు

**- కాల్పుల విరమణ వేళ పవన్ కామెంట్స్**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** భారత్-పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. దీన్ని దేశవ్యాప్తంగా పలువురు స్వాగతిస్తున్నారు. అదే సమయంలో విజయవాడలోని ఏపీ రాజ్ భవన్ లో సర్వమత సమ్మేళనం జరిగింది. దీనికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో పాటు పలువురు మంత్రులు, మతపెద్దలు హాజరయ్యారు. ఇందులో పవన్ కళ్యాణ్ కీలక ప్రసంగం చేశారు. మతం కంటే మానవత్వమే ముఖ్యమని ఆయన తెలిపారు. పహల్గాం ఘటన దేశాన్ని కలచివేసిందని, దేశం సహనానికి మారుపేరని ఆయన తెలిపారు. అన్ని ధర్మాలు, మతాలు విలసిల్లాలని అందరూ కోరుకుంటామన్నారు. రాజ్యాంగం రాక ముందు నుంచే ఈ సంస్కృతి ఉందన్నారు. ఉగ్రవాదం ఎప్పుడూ మన వెంటే ఉన్న ప్రమాదం అన్నారు. భిన్నత్వంలో ఏకత్వంలో చూసిన నేల ఇది అని పవన్ తెలిపారు. మన మతాలు వేరైనా అంతా భారతీయులమే అన్నారు. ఈ సందేశం దేశం మొత్తానికి చేరాలన్నారు. ఈ దేశాన్ని విడగొడదాం, విభజిద్దాం అని ఎన్నో శక్తులు ప్రయత్నిస్తుంటాయని, కానీ సగటు మనిషి మతానికి అతీతం అన్నారు. యుద్ధం కావాలని, గొడవ పెట్టుకోవాలని ఎవరూ కోరుకోరని,కానీ తప్పనిసరి అయ్యే యుద్ధ పరిస్థితులు వచ్చాయన్నారు. ఇదంతా ముగిసిపోవాలని, ఆ శుభవార్త కూడా త్వరలో వింటామన్నారు. అంతా ఏకమై తమ వారికి మతం కంటే దేశం గొప్పదనే సందేశం అందించాలన్నారు.

2లో..

## హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ 2025 పోటీలు ప్రారంభం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ప్రతిష్టాత్మక 72వ మిస్ వరల్డ్ 2025 పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ అంతర్జాతీయ అందాల పోటీల్లో 110కి పైగా దేశాల నుంచి వచ్చిన సుందరీమణులు విశ్వసుందరి కిరీటం కోసం పోటీపడుతున్నారు. భారత్ తరఫున మిస్ ఇండియా నందిని గుప్తా పాల్గొంటూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు.

2లో..

## మోదీజీ.. పాకిస్తాన్‌ని మ్యాప్‌లో లేకుండా లేపేయండి

- పాకిస్తాన్ వాళ్లతో ఎప్పటికి బాధే
- ముక్కలు ముక్కలు చేసేయండి
- మాజీ మంత్రి మల్లారెడ్డి డిమాండ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఇండియా-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. పాకిస్తాన్‌ను ప్రపంచ పటంలో లేకుండా లేపేయాలన్నారు. కుత్బుల్లాపూర్‌లోని మల్లారెడ్డి హెల్త్ వర్సిటీలో 'ఆపరేషన్ సిందూర్'లో పాల్గొన్న సైనికులకు సంఘీభావంగా జరిగిన కార్యక్రమంలో మరో మాజీ మంత్రి హరీష్ రావు, స్థానిక ఎమ్మెల్యే వివేకానందతో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడిన ఆయన.. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తుందన్నారు. భారత్ ఎన్నో ఏళ్లుగా పాకిస్తాన్ వల్ల బాధలు పడుతోందని చెప్పారు. అలాంటి పాకిస్తాన్‌ను ప్రపంచ పటంలో లేకుండా చేయాలని ప్రధాని మోదీని కోరారు.'స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతుంది. మనం పాకిస్తాన్‌తోని ఎప్పటికీ బాధలు పడ్తనే ఉన్నాం. వాళ్లు ఉగ్రవాదులను పోషిస్తున్నరు. ప్రధాన మంత్రిని మేం ఒకటే కోరుతున్నాం. మోదీజీ పాకిస్తాన్‌లోని ఉగ్రవాదాన్ని ఖతమ్ చేయండి. ముక్కలు, ముక్కలు చేసేయండి. ప్రపంచ మ్యాప్‌లోనే పాకిస్తాన్ లేకుండా చేయాలి. వాళ్ల బాధలు ఇక భరించాల్సిన అవసరం లేదు. మనకు ఇగ ఓపిక లేదు. మన సైనికులు ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారు. తెలుగు బిడ్డ మురళీ నాయక్ చనిపోవటం బాధాకరం. మనం ఏం చేసినా సైనికుల రుణం తీర్చుకోలేం. మనం మాత్రం వదిలే లేదు. భారత సైనికులకు అండగా ఉంటాం.

2లో..

# తెలంగాణ సహా 8 రాష్ట్రాలతో ఆపరేషన్ చక్ర-V

చేసింది. టెలికాం కంపెనీల పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) ఏజెంట్లు పనిచేస్తున్న ప్రదేశాల్లో సీబీఐ ఈ దాడులు నిర్వహించింది. వీరు మోసపూరితంగా సిమ్ కార్డులు విక్రయించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

### 8 రాష్ట్రాల్లోని 42 ప్రదేశాలలో దాడులు

అసోం, పశ్చిమ బెంగాల్, బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులోని మొత్తం 42 ప్రదేశాల్లో సీబీఐ ఏకకాలంలో దాడులు నిర్వహించింది. ఈ సమయంలో 38 పీఓఎస్ ఏజెంట్ల స్థానాల్లో సోదాలు చేసింది. ఈ ఏజెంట్లు, సైబర్ నేరస్థులతో కలిసి, నకిలీ కేవైసీ పత్రాల సహాయంతో సిమ్ కార్డులు జారీ చేస్తున్నారని సీబీఐ అనుమానిస్తోంది. తరువాత వాటిని మోసం, ఇతర కేసుల్లో ఉపయోగిస్తున్నారు.

### సీబీఐ చర్యలో ముఖ్యమైన ఆధారాలు లభ్యం

ఈ దాడి సమయంలో మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, నకిలీ కేవైసీ పత్రాలు, అనేక మంది అనుమానిత వ్యక్తుల సమాచారంతో సహా అనేక ముఖ్యమైన ఆధారాలు సీబీఐ స్వాధీనం చేసుకుంది. దీనితో పాటు, మధ్యవర్తుల పాత్ర పోషిస్తున్న ఇలాంటి అనేక మంది వ్యక్తులను కూడా గుర్తించారు.

### అరెస్టు అయిన వ్యక్తులు టెలికాం కంపెనీల నిబంధనలను ఉల్లంఘన

సీబీఐ అరెస్టు చేసిన 5 మంది వ్యక్తులు 4 వేర్వేరు రాష్ట్రాలకు చెందినవారు. వారందరూ టెలికాం కంపెనీల నిబంధనలను ఉల్లంఘించారని, సిమ్ కార్డులను మోసపూరితంగా విక్రయించారని ఆరోపించారు.తరువాత వీటిని యూపీఐ మోసం, డిజిటల్ అరెస్ట్, ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్స్ , ఐడెంటీ చోరీ వంటి సైబర్ నేరాల్లో ఉపయోగించారు. ప్రస్తుతం, ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది. రాబోయే రోజుల్లో మరిన్ని విషయాలు వెల్లడి కావచ్చు.

# ఎడారిగా మారుతున్న మూసీ ప్రాజెక్టు.?

ప్రాజెక్టు గేట్ల వద్దకు చేరే మట్టి, బురదను స్కవర్ గేట్లు ఎత్తి బయటకు పంపే వీలు ఉంటుంది. అయితే 1987లో మూసీకి వచ్చిన వరద తాకిడికి 8వ నంబర్ స్కవర్ గేటు పూర్తిగా కొట్టుకుపోయింది శిథిలావస్థకు చేరిన 10 స్కవర్ గేట్లను కాం క్రీట్తో పూర్తిగా మూసేయడంతో అప్పటికీ సమస్య తీరిపోయింది. కానీ ప్రాజెక్టు భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారని చెప్పాలి. వాస్తవానికి రంగారెడ్డి జిల్లా వికారాబాద్ అడవుల్లో మొదల్కె హైదరాబాద్, భువనగిరి, నల్లగొండ జిల్లాల విరీదుగా సూర్యాపేటకు వచ్చి చేరుతుంది.పై ప్రాంతంలోని వరద నీటితో పాటు ఉపనదులు, వాగులు వంకల్లోని ఇసుక, మట్టి కొట్టుకుని ప్రాజెక్టులోకి భారీగా చేరుతుంది. ఈ పరిస్థితిని అప్పట్లోనే అంచనా వేసిన నిపుణులు మూసీ ప్రాజెక్టుకు స్కవర్ గేట్లు ఏర్పాటు చేశారు. కానీ గత పాలకులు వాటిని పట్టించుకోకుండా కాంక్రీట్తో స్కవర్ గేట్లను మూసేయడంతో సిల్ట్ బయటకు పోయే పరిస్థితి లేకపోయింది. దీంతో మూసీ ప్రాజెక్టు ఏటేటా పూడిపోతోంది.మూసీ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నకిరేకల్, సూర్యాపేట, మిర్యాలగూడ, నల్లగొండ నియోజకవర్గాల పరిధిలోని 40 గ్రామాలకు చెందిన 41,800 ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగుకు నీటిని అందించేలా లక్ష్యంగా పెట్టుకున్నారు.అయితే ఆ సమయంలో ఆశించిన మేరకు వరద ప్రాజెక్టుకు చేరకపోవడంతో 1973లో దీన్ని యాసంగిలో ఆరుతడి పంటలకు నీటిని అందించే ప్రాజెక్టుగా మార్చిన అధికారులు సాగు విస్తీర్ణాన్ని 33వేల ఎకరాలకు కుదించారు. నిజానికి ఈ ప్రాజెక్టు నిర్మించిన మొదట్లో సదరు 4 నియోజకవర్గాల్లోని 45వేల ఎకరాలకు సాగునీరు, సూర్యాపేట పట్టణానికి తాగునీటిని అందించిన ఘన చరిత్ర ఉన్న ఈ ప్రాజెక్టులో పూడిక చేరడంతో ప్రస్తుతం కేవలం 30వేల ఎకరాలకు సైతం నీటిని అందించలేని దుస్థితికి చేరింది. పూడికతో నిండి ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యాన్ని కోల్పోయింది. మూసీ ప్రాజెక్టులో పూడిక తొలగిస్తే దాదాపు 15వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం దక్కుతుంది. కొత్త ప్రాజెక్టులు నిర్మించడం కంటే ఉన్న ప్రాజెక్టులను కాపాడుకుంటే ఎన్నో వ్యయప్రయాసలు తప్పుతాయని రైతాంగం అభిప్రాయపడుతోంది.కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) గతేడాది హైడ్రోగ్రాఫిక్, రిమోట్ సెన్సింగ్ సాంకేతికతతో నిర్వహించిన సర్వే మూసీకి పూడిక ముప్పును హెచ్చరించింది. దేశవ్యాప్తంగా 87జలాశయాలు పూడిక కారణంతో వేగంగా నీటినిల్వ సామర్థ్యాన్ని కోల్పోతున్నాయని పేర్కొన్న సీడబ్ల్యూసీ సర్వేలో తెలంగాణలోని ఉస్మాన్సాగర్తో పాటు మూసీ జలాశయం ఉన్నాయి. మూసీ జలాశయంలో ఇప్పటికే 15.32శాతం మేర సెడిమెంటేషన్(పూడిక) ఉందని పరిరక్షణ చర్యలు తప్పనిసరని ఈ సర్వే సూచించింది. 4.46టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో నిర్మితమైన మూసీ నిర్మించిన నాటి నుంచి 2024వరకు 0.74టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోయి ప్రస్తుత నీటినిల్వ సామర్థ్యం 3.72టీఎంసీలకు పడిపోయిందని పేర్కొంది. మూసీలో పూడిక తొలగింపు, పరిరక్షణ చర్యలు చేపట్టకుంటే 2084నాటికి జలాశయ సామర్థ్యం ఒక టీఎంసీ మేర తగ్గిపోతుందని హెచ్చరించింది.

# మాట తప్పిన పాకిస్తాన్ ఆర్మీ

ఒమర్ అబ్దుల్లా సైతం పేర్కొన్నారు. పాకిస్థాన్ ప్రయోగించిన పలు డ్రోన్లను భారత గగనతల రక్షణ వ్యవస్థలు సమర్థవంతంగా ఎదుర్కొని, ధ్వంసం చేసినట్లు తెలుస్తోంది. పోఖ్రాన్‌తో పాటు శ్రీనగర్‌లోని ఆర్మీ ప్రధాన కార్యాలయం సమీపంలో కొన్ని డ్రోన్లను కూల్చివేసినట్లు సమాచారం. ఈ దాడుల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. పంజాబ్‌లోని పఠాన్‌కోట్, ఫిరోజ్‌పూర్, రాజస్థాన్‌లోని జైసల్మేర్, బాడ్‌మేర్‌లలో ముందు జాగ్రత్త చర్యగా పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. జమ్మూకశ్మీర్‌లోని కఠువా జిల్లాలో కూడా బ్లాక్‌అవుట్ పాటించడంతో పాటు, జిల్లా వ్యాప్తంగా సైరన్లు మోగించారు. పంజాబ్‌లోని మోగాలోనూ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పాకిస్థాన్ డ్రోన్ల దాడుల ప్రభావం గుజరాత్‌పైనా పడినట్లు తెలుస్తోంది. కచ్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పాకిస్థాన్ డ్రోన్లు కనిపించాయని ఆ రాష్ట్ర హోంమంత్రి హర్ష్ సంఘవి వెల్లడించారు. దీంతో రాష్ట్రంలో పూర్తి బ్లాక్‌అవుట్‌ను అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలందరూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, ఎటువంటి భయాందోళనలకు గురికావద్దని ఆయన 'ఎక్స్' ద్వారా విజ్ఞప్తి చేశారు. సరిహద్దుల్లో నెలకొన్న తాజా పరిస్థితుల దృష్ట్యా భద్రతా బలగాలు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి.

## భారత్-పాక్ కాల్పుల

# విరమణ శుభపరిణామం

కాల్పుల విరమణను పరిగణనలోకి తీసుకున్నారని ఆయన తెలిపారు. ఈ నెల 12న ఇరుదేశాల మధ్య మళ్లీ చర్చలు జరుగుతాయన్నారు.రాజ్ భవన్‌లో జరిగిన సర్వమత సమావేశంలో ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లతో కలిసి చంద్రబాబు ప్రసంగించారు. భారత్–పాకిస్తాన్ కాల్పుల విరమణ సానుకూల ఫలితమని, దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి తమ హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా ఓ తీర్మానాన్ని ఆమోదించుకుందామన్నారు. ఉగ్రవాదం నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద ముప్పుగా మిగిలిపోయిందని చంద్రబాబు తెలిపారు. దేశమే ముందుంది అనేది మన సమిష్టి నినాదం కావాలన్నారు. జాతీయ సంక్షోభ సమయాల్లో ఐక్యంగా నిలబడి కలిసి ముందుకు సాగడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రజాస్వామ్యంలో, విభిన్న అభిప్రాయాలు ఉన్నప్పటికీ ప్రజలు దేశం కోసం కలిసి రావడం గొప్ప గౌరవం అన్నారు.

# ఏ ఉగ్రదాడి అయినా ఇక యుద్ధ చర్యే

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారతదేశ భద్రతా విధానంలో ఒక చారిత్రాత్మక మార్పు చోటుచేసుకుంది. భవిష్యత్తులో దేశ భూభాగంపై జరిగే ఎలాంటి ఉగ్రవాద చర్యలనైనా ఇకపై 'యుద్ధ చర్య'గానే పరిగణించాలని కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇటీవల పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి, దానికి ప్రతిగా కొనసాగుతున్న 'ఆపరేషన్ సింధూర్' నేపథ్యంలో, ముఖ్యంగా పాకిస్థాన్‌కు ఇది ఒక స్పష్టమైన హెచ్చరిక అని ప్రభుత్వ ఉన్నతస్థాయి వర్గాలు ఐఏఎన్ఎస్‌కు తెలిపాయి. భవిష్యత్ ఉగ్రదాడులను యుద్ధ చర్యలుగా పరిగణించాలన్న ఈ నిర్ణయంతో, దశాబ్దాలుగా భారత్ అనుసరిస్తున్న 'వ్యూహాత్మక సంయమనం' అనే విధానానికి స్వస్తి పలికినట్లయింది. "ఇది కేవలం భద్రతాపరమైన మార్పు మాత్రమే కాదు, ఉగ్రదాడులను ఇకపై భారత్ విడివిడి ఘటనలుగా పరిగణించబోదని ప్రపంచానికి ఇస్తున్న సంకేతం" అని ప్రభుత్వ వర్గాలు ఐఏఎన్ఎస్‌కు వివరించాయి.

దీని ద్వారా, ఉగ్రవాదానికి ప్రతిగా కేవలం చట్టపరమైన చర్యలే కాకుండా, అవసరమైతే సైనిక శక్తితో బదులిస్తామని భారత్ తేల్చిచెప్పింది. ఈ సిద్ధాంతపరమైన మార్పుతో, సరిహద్దు ఉగ్రవాదానికి పాల్పడితే రాజకీయంగా, దౌత్యపరంగా, సైనికపరంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని భారత్ స్పష్టం చేసింది. గత మూడు రోజులుగా రాత్రి సమయాల్లో ఉత్తర భారతదేశంలోని పలు సైనిక స్థావరాలు, పౌర నివాసిత ప్రాంతాలపై పాకిస్థాన్ డ్రోన్లు, క్షిపణులతో దాడులకు తెగబడుతున్న నేపథ్యంలో ఈ హెచ్చరిక ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే, భారత పటిష్టమైన వాయు రక్షణ వ్యవస్థ ఈ దాడులను పూర్తిగా అడ్డుకోగలిగింది. రెండు వారాల క్రితం జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పాకిస్థాన్ సంబంధిత ఉగ్రవాదులు జరిపిన కిరాతక దాడిలో 26 మంది పర్యాటకులు మరణించిన విషయం తెలిసిందే. ఈ దారుణ ఘటనకు ప్రతిస్పందనగా, భారత్ పాకిస్థాన్, పీవోకేలోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై ఖచ్చితమైన క్రూయిజ్ క్షిపణులతో దాడులు నిర్వహించింది. ఆ తర్వాత ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి.

# యుద్ధం ఎవరూ కోరుకోరు

మతం ఏదైనా మానవత్వానికే పెద్దపీట వేయాలన్నారు. తమ డీఎన్ఏలో దీన్ని భాగంగా మార్చుకోవాలన్నారు. మన బలగాలకు అండగా నిలిచిన ప్రతీ ఒక్కరికీ పవన్ అభినందనలు తెలిపారు.

## మోదీజీ.. పాకిస్తాన్‌ని మ్యాప్‌లో లేకుండా లేపేయండి

పాక్‌ను లేపేయండి' అని మల్లారెడ్డి హాట్ కామెంట్స్ చేశారు.ఉద్రిక్త పరిస్థితుల్లో దేశం కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధంగా ఉండాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. సరిహద్దుల్లో పోరాడలేకపోయినా.. సైనికుల కోసం రక్తదానం చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. పాకిస్థాన్ వల్ల భారతదేశం చాలా నష్టపోతుందని మల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇక మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు మాట్లాడుతూ దేశ ప్రజలంతా సైనికుల కుటుంబాలకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన జవాన్లకు దేశం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందన్నారు. మురళి నాయక్ పోరాటం, సాహసం వృథా కాదని, భారత్ తప్పకుండా విజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## హైదరాబాద్‌లో మిస్ వరల్డ్

# 2025 పోటీలు ప్రారంభం

ప్రారంభోత్సవ వేడుకలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా అత్యంత వైభవంగా నిర్వహించారు. 'జయజయహే తెలంగాణ' రాష్ట్ర గీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో 250 మంది కళాకారులు ప్రదర్శించిన పేరిణి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.పరిచయ కార్యక్రమంలో వివిధ దేశాల సుందరీమణులు తమ ప్రత్యేక దుస్తులలో ర్యాంప్ వాక్ చేస్తూ ఆకట్టుకున్నారు. ఈ వేడుకకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, పర్యాటక శాఖ ఛైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, మేయర్ విజయలక్ష్మి, మిస్ వరల్డ్ సీఈవో జూలియా మోర్లే, మిస్ వరల్డ్ 2024 విజేత క్రిస్టినా పిస్కోవా తదితర ప్రముఖులు హాజరయ్యారు.

# దేశ రక్షణ కోసం ఒక నెల జీతం విరాళం

**– శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**

**హైదరాబాద్** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు భారత రక్షణ నిధికి తాను ఒక నెల జీతం ఇస్తున్నట్లు తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. తనతోపాటు శాసనమండలి వైస్ ఛైర్మన్, శాసనమండలి సభ్యులను కూడా భారత రక్షణ అనేది ఒక నెల వేతనాన్ని ఇవ్వాలని ఆయన కోరారు. పహల్గామ్ లో టూరిస్టులపై ఉగ్రవాదుల నరమేధం తర్వాత భారత రక్షణ దళాలు చేపట్టిన అన్ని చర్యలను తమ సమర్థిస్తూ ఏకీభవిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తే పూర్తిస్థాయి యుద్ధం జరిగేటట్లుగా కనబడుతుందని ఆయన చెప్పారు భారత్ పాకిస్తాన్ పై ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తుంటే పాకిస్తాన్ మాత్రం భారత పౌరులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేయడం విశారకరమన్నారు. ఇది యుద్ధ నీతి కూడా కాదని ఆయన పాకిస్తాన్ చర్యలను తీవ్రంగా ఖండించారు. పాక్ ఆక్రమించే కాశ్మీర్ ను పూర్తిగా స్వాధీనం చేసుకుని భవిష్యత్తులో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించడం లక్ష్యంగా తీసుకుంటున్న భారతీయులను రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ దేశానికి అండగా నిలవాలని గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. పాకిస్తాన్ తీవ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ తీసుకుంటున్న ప్రతి చర్యలను తాము పూర్తిగా సమర్థించడంతోపాటు దేశానికి రక్షణ వ్యవస్థకు అండగా నిలబడతామని ఆయన స్పష్టం చేశారు

# ఛార్ధామ్ యాత్ర నిలిపివేత



**న్యూఢిల్లీ** ఛార్ధామ్ యాత్ర నిలిపివేసారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. యాత్రికుల క్షేమం దృష్ట్యా ఛార్ ధామ్ యాత్రను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. పాక్ దాడులు చేసే అవకాశం ఉండడంతో గంగోత్రి, యమునోత్రి, కేదార్ నాథ్, బద్రీనాథ్ ఆలయాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేసినట్లు తెలిపింది. ఈ ఏడాది చార్ ధామ్ యాత్ర ఏప్రిల్ 30న ప్రారంభమైంది. బద్రినాత్, కేదార్నాథ్, గంగోత్రి, యమునోత్రిలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసారు. హెలికాప్టర్ సేవలను కుడా నిలిపివేస్తూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. యాత్ర ఎప్పటి వరకు రద్దు, తిరిగి ఎప్పుడు ప్రారంభించే విషయాలను త్వరలోనే వెల్లడిస్తామని పేర్కొంది.

# నేడు జాతీయ సాంకేతిక దినోత్సవం

**( పెండ్యాల రామ్ కుమార్, మంథని )**




భారతదేశ సాంకేతిక పురోగతికి గుర్తుగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. భారతదేశ సైన్యంజాతీయ రాజస్థాన్‌లోని ప్రోఖ్రాన్ టెస్ట్ రేంజ్ వద్ద శక్తి –1 అణు క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఈ పరీక్షకి దివగంత రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నాయకత్వం వహించారు. దీనిని ఆపరేషన్ శక్తి లేదా ప్రోఖ్రాన్ –2 అని పిలిచారు. రెండు రోజుల తర్వాత ఆపరేషన్ శక్తిలో భాగంగా భారతదేశం రెండు అణ్వాయుధాలను విజయవంతంగా పరీక్షించింది. శక్తి, ప్రోఖ్రాన్, న్యూక్లియర్ టెస్ట్ , స్మైలింగ్ బుద్ధ అనే మొదటి అణు పరీక్ష 1974లో జరిగాయి. రెండో అణుపరీక్షను 1998 మే లో భారత సైన్యం ప్రోఖ్రాన్ టెస్ట్ రేంజ్ వద్ద ఐదు వరుస న్యూక్లియర్ బాంబుల పరంపరను విజయంవంతంగా పరీక్షించింది.

దీంతో అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి భారతదేశాన్ని అణు రాష్ట్రంగా ప్రకటించడమే కాక మే 11ను జాతీయ సాంకేతిక దినంగా ప్రకటించారు. న్యూక్లియర్ క్లబ్‌లో చేరిన ఆరవ దేశంగా, అణ్వాయుధాల వ్యాప్తి నిరోధక(ఎన్‌పీటీ)లో పాల్గొనని మొదటి దేశంగా నిలిచింది. 1999 నుండి టెక్నాలజీ డెవలప్‌మెంట్ బోర్డు(టీడీబీ) ఈ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తోంది. ప్రతి ఏడాది టీడీబీ ఒక కొత్త థీమ్ ని ఎంచుకుంటోంది. ఈ దినోత్సవం నిత్యజీవితంలో సైన్స్ యెక్క ప్రాముఖ్యతను తెలియజేస్తోంది.

# స్వచ్ఛ పల్లెలు కోసం యాప్

**హైదరాబాద్ :** గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా స్వచ్ఛ పల్లెలే లక్ష్యంగా సరికొత్త యాప్‌ను రూపొందించింది.తద్వా రా చెత్త సేకరణ సమస్యకు శాశ్వత పరిష్కా రం చూపనుంది. ఎన్ని చర్యలు చేపట్టినా పం చాయతీల్లో చెత్త సేకరణ సరిగా ఉండకపోవడం, డంపింగ్ యార్డులతో పంచాయతీల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు స్వచ్ఛదనం పెంచే దిశలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కార్యాచరణను రూపొందించారు. దీంతో చెత్త సేకరణ పర్యవేక్షణ కోసం ప్రత్యేక యాప్ ను రూపొందించారు. వారం, పది రోజుల్లో ఈ యాప్ అందుబాటులోకి రానున్నది.ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు పీఎస్ యాప్ అందింది. ఆ యాప్‌లో పంచాయతీ ల నిర్వహణపై ఎప్పటికప్పుడు సమాచారా న్ని పొందుపరుస్తున్నారు. ప్రతిరోజు కాలువలు, వీధులు, ఇన్ స్టిట్యూషన్లను శు భ్రపరి చే సమాచారం, ఫొటోలను చేరుస్తున్నారు.ఇప్పుడు అదే యాప్‌లో మరో ఆప్షన్‌ను ప్రభుత్వం చేర్చింది. ఆ ఆప్షన్ ద్వారా ప్రతిరోజు గ్రామంలో ఎన్ని నివాసాల నుంచి చెత్త సేకరించారు. ఎంత మేర చెత్త పోగయ్యింది. అందులో తడి చెత్త, పొడి చెత్త ఎం త వంటి సమాచారాన్ని పంచాయతీ కార్యదర్శులు అప్‌లోడ్ చేయనున్నారు.యాప్‌లో అప్‌లోడ్ చేసిన సమచారాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు. సేకరించిన చెత్తను ఎక్కడో ఒక చోట డంప్ చేయకుండా చర్యలుతీసుకోనున్నారు. తడి చెత్తను 60 రోజుల్లో ఎరువుగా మార్చాలి, కేజీ పొడి చెత్త 60 రోజుల్లో 150 గ్రాముల ఎరువుగా మారుతుంది.ప్లాస్టిక్, సీసాలు వంటి పొడి చెత్తను ప్లాస్టిక్ డిస్పోస్ కేంద్రాలకు తరలించడం లేక అమ్మేయడం చేస్తారు. ఎట్టి పరిస్థితుల్లో గ్రామాల్లో డంప్ చేయకూడదని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో ఒక్కో వ్యక్తి కనీసం 100 గ్రాముల చెత్తను జనరేట్ చేస్తారని అంచనా.దానికనుగుణంగా ఆయా గ్రామాల్లో అంత మేర చెత్త సేకరణ జరగకపోతే పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేనట్టుగా గుర్తిస్తారు. అలాంటి సందర్భంలో పంచాయతీ కార్యదర్శిని అప్రమత్తం చేసి, చెత్త సేకరణ ప్రక్రియను మెరుగుపరిచేలా అధికారులు ఆదేశాలిస్తారు. యాప్ ద్వారా నిత్యం చెత్త సేకరణ ప్రక్రియను పర్యవేక్షించడం ద్వారా గ్రామాల్లో స్వచ్ఛదనం పెరుగనున్నది.

# ఎకరం భూమి 95 లక్షలు

**వరంగల్ :** వరంగల్ మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణ ప్రాజెక్టు ఊహించిన దానికంటే ఎక్కువ సమయం తీసుకుంటోంది. దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉన్న ఈ విమానాశ్రయానికి మళ్లీ పూర్వ వైభవం తీసుకురావాలన్న ప్రభుత్వ సంకల్పానికి భూసేకరణ అతిపెద్ద అవరోధంగా నిలిచింది. అయితే.. ఇప్పుడు ఆ అడ్డంకి తొలగిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ సత్యశారద నేతృత్వంలోని అధికారుల బృందం గత కొద్ది రోజులుగా భూములు కోల్పోతున్న రైతులు, నిర్వాసితులతో జరిపిన నిరంతర చర్చలు ఫలించాయి. ఎట్టకేలకు తమ భూములను విమానాశ్రయ అభివృద్ధికి ఇవ్వడానికి రైతులు సానుకూలంగా స్పందించడం శు భపరిణామం.వరంగల్ నగరానికి అత్యంత సమీపంలో మామునూరు విమానాశ్రయం ఉండటంతో ఇక్కడి భూములకు మంచి విలువ ఉంది. అందుకే రైతులు తమకు మెరుగైన నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. నిర్వాసిత గ్రామాలైన ఖిలా వరంగల్ మండలంలోని నక్కలపల్లి, సంగెం మండలంలోని గుంటూరుపల్లి, గాడిపల్లిలో రెవెన్యూ అధికారులు ఇప్పటికే భూముల వివరాల సర్వేను పూర్తి చేశారు. ఈ ప్రక్రియలో భాగంగా.. భూముల హద్దులు గుర్తించడం.. వాటి యాజమాన్య హక్కులను నిర్ధారించడం వంటి పనులు జరిగాయివరంగల్ ఎయిర్‌పోర్టు ఆలస్యానికి కారణం వారే: కేంద్రమంత్రి రామ్మోహన్ప్రస్తుతం మామునూరు విమానాశ్రయంలో భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) ఆధీనంలో 696.14 ఎకరాల భూమి ఉంది. విమానాశ్రయాన్ని విస్తరించేందుకు అధికారులు అదనంగా 136 మంది రైతుల నుండి మరో 253 ఎకరాల భూమిని సేకరిస్తున్నారు. ఈ భూసేకరణ కోసం గత సంవత్సరమే రాష్ట్ర ప్రభుత్వం రూ. 205 కోట్లను విడుదల చేసింది. భూసేకరణ ప్రక్రియ ఒక కొలిక్కి రాగానే విమానాశ్రయ అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు కేంద్ర విమానయాన శాఖ కూడా ఇప్పటికే రూ. 450 కోట్లు కేటాయించింది. భూసేకరణ పూర్తయిన విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలియజేయగానే, ఏఏఐ విమానాశ్రయ విస్తరణ పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించనుంది.నిర్వాసితులకు చెల్లించే నష్టపరిహారం విషయంలో అధికారులు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులకు గతంలో చెల్లించిన పరిహారం మరియు ఇతర సంబంధిత అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత.. నిర్వాసితులకు జనరల్ అవార్డు ప్రకారం ఎకరాకు రూ. 65 లక్షల చొప్పున ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే.. జిల్లా కలెక్టర్‌కు ఉన్న విచక్షణాధికారాలను ఉపయోగించి ఈ జనరల్ అవార్డుకు మరో 50 శాతం వరకు పెంచి ఇచ్చే అవకాశం కూడా ఉంది. ఒకవేళ ఇది నిజమైతే.. నిర్వాసితులకు ఎకరాకు దాదాపు రూ. 95 లక్షల వరకు నష్టపరిహారం అందే అవకాశం ఉంది. ఒకవేళ ఇంత భారీ మొత్తం పరిహారం చెల్లిస్తే.. రాష్ట్రంలో ఇప్పటివరకు భూమి కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చిన అత్యధిక మొత్తం ఇదే అవుతుంది.

# కల్లు రవాణాపై ఆంక్షలేమి లేవు

**నల్గొండ :** తెలంగాణ సంస్కృతిలో కల్లు ఒక భాగం. చాలా మంది తాటి, ఈత కల్లును ఇష్టంగా తాగుతుంటారు. కొందరు దాన్ని వ్యసనం అంటే.. మరికొందరు అలవాటు పడిన ఓ సాంప్రదాయం అంటుంటారు. ప్రకృతి ప్రసాదించిన అమృతమని చెబుతుంటారు. పట్టణాల్లో నివసించేవారు సైతం పల్లెటూళ్ల నుంచి వచ్చే తమ బంధువులు, స్నేహితుల ద్వారా కల్లును తెప్పించుకుంటుంటారు. అయితే ఇలా తీసుకొచ్చే క్రమంలో కొన్నిసార్లు ఇబ్బందులు తలెత్తుతాయి. ప్రైవేట్ వెహికల్స్‌లో అయితే ఓకే కానీ.. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ అయిన ఆర్టీసీ బస్సుల్లో కల్లును తీసుకెళ్లొచ్చా..? ఇదే విషయంపై ఓ మహిళ యవ్వారం చర్చకు దారి తీసింది.నల్గొండ జిల్లా కట్టంగూరుకు చెందిన ఓ మహిళ కల్లు బాటిళ్లతో నల్గొండ బస్సు ఎక్కింది. అది గమనించిన డ్రైవర్, కండక్టర్ బస్సులోకి కల్లు తీసుకురాకూడదని చెప్రారు. కల్లు బాటిళ్లు తీసుకెళ్లకూడదంటూ ఆమెను మధ్యలోనే దింపేశారు. దీంతో సదరు మహిళ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏకంగా ఆ బస్సుకు అడ్డుగా నిలబడి నిరసన వ్యక్తం చేసింది. ఇది తమ ఊరిలో చేసే సాంప్రదాయమని.. పుట్టిన రోజు సందర్భంగా కల్లు తీసుకెళ్తున్నానని వెల్లడించింది. కల్లు తీసుకెళ్తుంటే.. నువ్వెవ్వరు నన్ను ఆపేదంటూ కాసేపు హల్‌చల్ చేసింది.సమాచారం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆమెను శాంత పరిచారు. అనంతరం బస్సు అక్కడి నుంచి వెళ్లిపోయింది. అయితే అందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆర్టీసీ బస్సుల్లో కల్లు తీసుకురాకూడదనే రూల్ ఏమైనా ఉందా..? కల్లును బస్సులో తీసుకుపోవడాన్ని ప్రభుత్వం నిషేదించిందా? తెలంగాణలోని దానిని బ్యాన్ చేశారా..? ఈ విషయంలో ఆర్టీసీ యాజమాన్యం స్పందించాలని కొంతమంది నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఇలా ఆ మహిళ యవ్వారం ఇప్పుడు కొత్త చర్చకు దారి తీసింది.ఇక రూల్స్ విషయానికొస్తే.. తెలంగాణలోని బస్సుల్లో కల్లు తీసుకెళ్లటం నిషేదం అంటూ స్పష్టమైన నిబంధనలు లేవు. సాధారణంగా ప్రయాణికులు తమ వ్యక్తిగత అవసరాల కోసం పరిమిత మోతాదులో తీసుకువెళ్లేందుకు అనుమతి ఉండవచ్చు. అయితే ఎక్కువ మె?త్తంలో తరలించడం చట్టవిరుద్ధం కావచ్చు. వాణిజ్యపరమైన ఉద్దేశ్యంతో కల్లును తరలించటం పైనా నిషేదం ఉండొచ్చు. పరిమిత మోతాదులో కల్లును తీసుకెళ్లినా.. ప్యాకింగ్ సరిగా ఉండాలి, ఇతరులకు అసౌకర్యం కలిగించకూడదు. అలాగే కల్లును అనుమతించే విషయంలో ఆర్టీసీ అధికారుల తుది నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. అయితే ఈ విషయంపై తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, ఎక్సైజ్ అధికారులు క్లారిటీ ఇవ్వాల్సి ఉంటుంది.

## రెండు కార్లు ఢీ..

# ఒకరు సజీవ దహనం

**రంగారెడ్డి** హైదరాబాద్ నగర శివారు లోని పెద్దఅంబర్ పేట్ ఔటర్ రింగురోడ్డు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న బొలెరో వాహనాన్ని టాటా కర్వ్ కారు ఢీకొట్టింది. రెండు వాహనాలు మంటలో పూర్తిగా దగ్ధం అయ్యాయి.

ఒక కారులో ఉన్న వ్యక్తి సజీవ దహనం అయ్యాడు. మరోకరిని స్థానికులు కాపాడారు. పెద్దఅంబర్ పేట్ నుండి ఘట్కేసార్ వెళుతున్న ఔటర్ రింగురోడ్డు సర్వీస్ రోడ్డులో ప్రమాదం జరిగింది.

# ఢిల్లీ ఎయిమ్స్ వైద్యుల సెలవులు రద్దు

ఢిల్లీలోని ఎయిమ్స్ వైద్యులు, సిబ్బంది, ఉద్యోగులకు సెలవులు రద్దు చేస్తూ కేంద్ర ఆరోగ్య శాఖ నిర్ణయం తీసుకుంది. ఆరోగ్య కారణాలు మినహా.. ఏ ఒక్కరికి సెలవులు మంజూరు చేయకూడదని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే సెలవుల్లో ఉన్నవారి సెలవులను రద్దు చేస్తూ వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించింది. తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు సెలవుల రద్దు నిర్ణయం కొనసాగుతుందని స్పష్టం చేసింది.

# నూతన కేంద్రీయ విద్యాలయ ప్రారంభానికి చర్యలు తీసుకోండి:కలెక్టర్ రాజకుమారి గణియా

**- దొరపల్లిగుట్ట హౌసింగ్ కాలనీలో మౌలిక వసతులు కల్పించండి**



**నంద్యాల (ప్రశ్న న్యూస్)** డోన్ పట్టణంలో ఈ విద్యా సంవత్సరం నుండి నూతన కేంద్రీయ విద్యాలయ ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి కేంద్రీయ విద్యాలయ అధికారులను ఆదేశించారు. డోన్ పట్టణంలో ఐటిఐ కాలేజీలో ఈ ఏడాది నూతన కేంద్రీయ విద్యాలయ ప్రారంభానికి అవసరమయ్యే తాత్కాలిక భవనాలను పరిశీలించారు.డోన్ పట్టణంలో కేంద్రీయ విద్యాలయం ప్రారంభానికి అనుమతులు వచ్చిన నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరం నుండి ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ ను కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం కేంద్రీయ విద్యాలయ భవనాలు నిర్మాణంలో లేనందువల్ల తాత్కాలి ఏర్పాటుకు ప్రభుత్వ ఐటిఐ కాలేజీ భవనాలను కలెక్టర్ పరిశీలిస్తూ మౌలిక వసతుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమయ్యే తరగతి గదులు, టాయిలెట్లు త్రాగునీటి వసతి ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సి ఉందని కలెక్టర్ సంబంధిత అధికారులను కలెక్టర్ సూచించారు. డోన్ పట్టణ సమీప ప్రాంతంలో కేంద్రీయ విద్యాలయ శాశ్వత భవనాల నిర్మాణానికి గుర్తించిన 9.5 ఎకరాల స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. సంబంధిత స్థలంలో విద్యుత్ స్తంభాలు, సర్వీస్ వైర్ల తొలగింపుకు చర్యలు తీసుకోవాలని ట్రాన్స్కో అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

### దొరపల్లిగుట్ట హౌసింగ్ కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తాం - జిల్లా కలెక్టర్

అనంతరం డోన్ పట్టణ శివారు ప్రాంతంలో ఉన్న దొరపల్లిగుట్టలో నిర్మించనున్న హౌసింగ్ కాలనీ కలెక్టర్ పరిశీలించారు. హౌసింగ్ కాలనీలో 1554 గృహాలు మంజూరు కాగా 766 మంది లబ్ధిదారులు గృహాలు పూర్తి చేసుకున్నారని హౌసింగ్ ఏఈ కలెక్టర్ కు నివేదించారు. గుట్టపై గృహాలు మంజూరు కావడం వల్ల త్రాగునీటి వసతి, రహదారి సౌకర్యం ఇబ్బందిగా ఉన్నట్లు కలెక్టర్ కు వివరించారు. వాటర్ గ్రిడ్ ద్వారా పైప్ లైన్ వేసి శాశ్వత ప్రాతిపదికన నీటి సరఫరా కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ను కలెక్టర్ ఆదేశించారు. త్రాగునీటి వసతితో పాటు రహదారి సౌకర్యం, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని మిగిలిన లబ్ధిదారులు ముందుకు వచ్చి గృహాలు నిర్మించుకునేందుకు ప్రోత్సహించాలని హౌసింగ్ ఇంజనీర్లను కలెక్టర్ ఆదేశించారు. అలాగే అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. డోన్ ఆర్డీవో నరసింహులు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, తాసిల్దార్ నాగమణి, జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి, డిప్యూటీ డిఇఓ సుధాకర్ రెడ్డి, హౌసింగ్ డిఈ కృష్ణారెడ్డి, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# భారతదేశ కోసం యుద్ధంలో పోరాడుతున్న సైన్యానికి మద్దతుగా సంఘీభావంగా శాంతి ర్యాలీ

- పార్టీలు,కులాలుగా విడిపోయినా దేశం కోసం మేమంతా ఒక్కటే.
- తీవ్రవాదులను మట్టుపెట్టి దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుతాము.
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**మంథని ( ప్రశ్న న్యూస్)** బారత దేశ ఔన్నత్యం చాటుతూ, పౌరుషాన్ని చూపుతూ పాకిస్తాన్ తీవ్రవాదులను మట్టుపెడుతున్న వీర సైనికులకు మేమున్నామని, దేశం కోసం పోరాటం చేయాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. మంథని నియోజకవర్గ భీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం భారత సైన్యానికి సంఘీభావంగా మంథని పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే చౌక్ నుంచి చాకలి ఐలమ్మ చౌక్ మీదిగా అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశంలో విభిన్నమైన మతాలు, కులాలు ,బాషలు ఉన్నా .ఈ దేశం మట్టి గొప్పతనాన్ని చాటుతూ ప్రతి పౌరుడు హింసలేకుండా అహింసామార్గంలో జీవిస్తుంటే పాకిస్తాన్‌లోని తీవ్రవాదులు హింసామార్గాన్ని ఎంచుకుంటున్నారని అన్నారు. పాకిస్తాన్ తీవ్రవాదులకు ఆశ్రయంగా మారిందని, అక్కడ స్థావరాలను అడ్డగా ఏర్పాటు చేసుకుని దేశాన్ని ప్రపంచాన్ని ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. అయితే ఏప్రిల్ 22న జరిగిన సంఘటనకు ధీటుగా దేశ సైనికులు తీవ్రవాదులను మట్టుబెట్టారని, ఈ దాడిలో సామాన్యులకు, దేశ సంపదకు ఎలాంటి నష్టం జరుగకుండా చూశారన్నారు. దేశంలో పార్టీలు, కులాలుగా విడిపోయినా దేశ సంఘటితం, పటిష్టత కోసం సార్వభౌమాధికారాని కాపాడడానికి ఏకతాటిపైకి వస్తామని




ఆయన కొనియాడారు. . పాకిస్తాన్ తీవ్రవాదుల దాడిలో మృతి చెందిన తెలుగు బిడ్డ మురళీధర్ నాయక్‌తో పాటు పహల్గాంలో తీవ్రవాదులు హతమార్చిన టూరిస్టులకు ఆయన ఈ సందర్భంగా ఘన నివాళులు అర్పించి సంతాపం తెలిపారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం
# ముఖ్య అతిథిగా పాల్గొన్న బండి రమేష్



కూకట్పల్లి(ప్రశ్నన్యూస్) పేద ప్రజలకు పార్టీ తరపున ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. 114 డివిజన్ నాయకుల ఆధ్వర్యంలో కెపిహెచ్బి కాలనీ ఏడో పేస్ లోని బాస్కెట్ బాల్ గ్రౌండ్లో మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ వైద్య శిబిర నిర్వాహకులు రంగ, నితీష్ గౌడ్, ప్రవీణ్ కుమార్, పొడుగు అప్పారావు, అరవింద్ రెడ్డి ,రంగస్వామిలను అభినందించారు. భవిష్యత్తులోనూ పార్టీ నాయకులు మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కూకట్పల్లి నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు సేరి సతీష్ రెడ్డి ,మేకల మైఖేల్, అంజిబాబు ,రమణ దితరులు పాల్గొన్నారు.

## కాసులు చెల్లించంనీదే కార్యచరణ
# ఉండని విద్యుత్ అధికారుల పనితీరు



**నిజామాబాద్ (ప్రశ్నన్యూస్)** నాణ్యమైన విద్యుత్ సరఫరా అనేది ప్రభుత్వం అంటుంటే విద్యుత్ అధికారులు మాత్రం కాసులు ఉంటేనే పని ఒక్కో పనికి ఒక తీరు ఒక్కొక్కరికి ఒక తీరు ఏ మాత్రం చెల్లించనిదే పని జరగదు. ప్రతి ఒక్కరూ రైతుపై పడి బతుకుడే ఇప్పుడున్న రైతును కాపాడేది డబ్బు మాత్రమే ప్రభుత్వం రైతును రాజ్యం చేయాలనుకుంటుంటే అధికారులు మాత్రం సహకరించడం లేదు ఉన్నోళ్లకు ఒక తీరు లేనోళ్లకు ఒక తీరు అన్నట్టుగా ప్రతి ఉద్యోగి అందుబాటులో ఉండాలి స్థానికంగా నివాసం ఉండాలే అని నిబంధన ఉన్నప్పటికీ దాన్ని తుంగలో తొక్కి కొందరు అధికారులు నగరాల్లో నివసిస్తూ పల్లెల్లో పని చేస్తున్నారు.

## బాలురను ఉత్తమ విద్యకు
# దూరం చేస్తున్న ప్రభుత్వం

- ఎస్సీ,ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట నాయకులు : కొంకటి శేఖర్
- అల్గునూర్ సీఈఓ బాలుర హాస్టల్ పునర్వ్యవస్థపై మండిపడుతున్న సంఘాలు



**బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్)** ఉత్తర తెలంగాణ ప్రాంతానికి చెందిన బాలురకు ఉన్న ప్రత్యేక విద్యా అవకాశాలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కొంకటి శేఖర్ మండిపడ్డారు. అల్గునూర్‌లో ఉన్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ను కేవలం బాలికలకు పరిమితం చేస్తూ, అక్కడ చదువుతున్న బాలురను వేరే హాస్టళ్లకు పంపించడం అన్యాయమన్నారు. 2007లో డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ సీఓఈ పాఠశాల స్థాపించబడిందని, అప్పటి నుంచీ ఐఐటీ, నీట్ వంటి జాతీయ స్థాయి పరీక్షలకు విద్యార్థులను తీర్చిదిద్దే పటిష్ట శిక్షణ ఇస్తూ ఉత్తమ ఫలితాలు సాధించిందని ఆయన గుర్తు చేశారు. అయితే తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బాలురకు తీవ్ర అన్యాయమని ఆయన అభిప్రాయపడ్డారు."ఈ నిర్ణయం ద్వారా ఉత్తర తెలంగాణ బాలురకు ఉన్న ప్రీమియర్ సీఓఈ విద్యా అవకాశాన్ని దూరం చేస్తున్నారు. ఇది పక్షపాతంతో కూడిన నిర్ణయం," అని కొంకటి శేఖర్ అన్నారు. గౌలిదొడ్డి మల్టీజోన్-2లో బాలురకు, బాలికలకు వేరే సీఓఈ లు ఉండగా, అలుగునూర్ సీఓఈ ను కేవలం బాలికలకు పరిమితం చేయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.

### ఐదు ముఖ్యమైన డిమాండ్లు

- ప్రస్తుత సీఓఈ లో చదువుతున్న బాలురను ఎలాంటి అభ్యంతరం లేకుండా వేరే హాస్టళ్లకు పంపించడాన్ని నిలిపివేయాలి. బాలికల కోసం పాఠశాలను మార్చాలనుకుంటే, బాలురకు ప్రత్యామ్నాయ సీఓఈ ఏర్పాటు చేయాలి.

ఉత్తర తెలంగాణ బాలురకు ప్రత్యేకంగా సీఓఈ కొనసాగించాల్సిందే. కరీంనగర్లో చింతకుంట బాలికల కోసం, ప్రస్తుత సీఓఈ ని బాలుర కోసం వేర్వేరుగా నడపాలి. అలుగునూర్ సీఓఈ విద్యా విధానాన్ని కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఈ అంశంపై ప్రభుత్వం, గురుకుల అధికారులు పునరాలోచించకపోతే తీవ్ర నిరసనలు ఎదుర్కోవలసి వస్తుందని కొంకటి శేఖర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# పదేళ్ల నుంచి టీటీడీ ఉచిత వివాహాలు

**తిరుమల :** శ్రీవారి సన్నిధిలో వివాహం చేసుకోవాలనుకుంటున్న వధూవరులకు శుభవార్త. శ్రీవారి సన్నిధిలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వధూవరులకు ఉచితంగా వివాహాలను జరిపిస్తుంది. తిరుమల పాప వినాశనం రోడ్డులోని కల్యాణ వేదికలో వివాహాలు జరిపిస్తున్నామని టీటీడీ తెలిపింది.పురోహితుడు, మంగళవాయిద్యాలతో పాటు పసుపు, కుంకుమ, కంకణాన్ని ఉచితంగా టీటీడీ అధిస్తుంది. అయితే, వివాహానికి కావాల్సిన సామాగ్రిని వధూవరులే తీసుకెళ్లాలి. వధూవరుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరు కావాలి.. వారురాలేని పక్షంలో సంబంధించిన ఆధార పత్రాలను సమర్పించాలని టీటీడీ పేర్కొంది. వివాహం అనంతరం రూ.300 ప్రత్యేక ప్రవేశం ద్వారా వధూవరులతో పాటు ఇరువురి తల్లిదండ్రులను కలిపి మొత్తం ఆరుగురిని ఉచితంగా శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు. ఆరు లడ్డూలను ఉచితంగా కౌంటర్లలో అందిస్తారు. అయితే, వధువుకు 18ఏళ్లు, వరుడికి 21ఏళ్లు నిండి ఉండాలి. ద్వితీయ వివాహాలు, ప్రేమ వివాహాలు నిర్వహించబోమని టీటీడీ పేర్కొంది.

### స్లాట్ బుకింగ్ ప్రక్రియ ఇలా..

- వివాహం కోసం బిబిజూబ://బిబిటవలజీబబిష్ట్రజీనిజీఎబ.జీజూ.ఐనీల.తిని వెబ్ సైట్ ద్వారా స్లాట్ నమోదు చేసుకోవాలి. వధూవరులు తమ తల్లిదండ్రుల వివరాలతో పాటు ఆధార్ కార్డులను అప్ లోడ్ చేయాలి బర్త్ సర్టిఫికెట్ లేదా పదో తరగతి మార్కుల జాబితా/టీసీ జతచేయాలి.వివాహ తేదీ, సమయాన్ని నిర్ణయించుకుని అప్ లోడ్ చేయాలి. ఆ తరువాత ధ్రువీకరణ పత్రం జారీ అవుతుంది.

ఆ పత్రాన్ని తీసుకొని వివాహ సమయానికి 6గంటల ముందు తిరుమల కల్యాణ వేదిక వద్ద ఉన్న కార్యాలయంలో వివరాలను పరిశీలించుకోవాలి.కల్యాణ వేదిక వద్ద హిందూ వివాహ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వివాహాన్ని రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. వధూవరుల వయసు ధ్రువపత్రాలు, నివాస ధ్రువ పత్రం, పెళ్లి ఫొటో, పెళ్లి పత్రిక, కల్యాణ మండపం రశీదుతో పాటు అవివాహితులగా ఉన్నట్లు స్థానిక తహసీల్దార్ నుంచి ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. ఇతర వివరాలకు 0877-2263433 నంబర్ ను సంప్రదించవచ్చు.2016 నుండి తిరుమల పాపావినాశనం రోడ్డులోని కళ్యాణ వేదిక వద్ద టీటీడీ ఉచితంగా వివాహాలు నిర్వహిస్తూ వస్తోంది. ఇప్పటి వరకు 26,214 వివాహాలు జరిపించినట్లు టీటీడీ తెలిపింది.

# ఆచితూచి దెబ్బ..

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏం చేసినా చేతికి మట్టి అంటకుండా చేసుకుంటారు. ప్రత్యర్థికి సానుభూతి కంటే తనపై వ్యతిరేకత రాకుండా చూసుకోవడంలో చంద్రబాబును మించిన వారు లేరు. జగన్ తరహాలో దూకుడుగా వ్యవహరించరు. అందుకే జగన్ అరెస్ట్ చేయాలని టీడీపీ సోషల్ మీడియాలో హోరెత్తిపోతున్నప్పటికీ తాను మాత్రం చట్టం తన పని తాను చేసుకుపోతుందని, తప్పు చేసిన వారు శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరిస్తూ కార్యకర్తలకు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే సమయంలో తనను యాభై రెండు రోజుల పాటు రాజమండ్రి జైలులో వేసిన జగన్ ను క్షమించి చంద్రబాబు వదిలేస్తారని అనుకోవడం కూడా అవివేకమే అవుతుందిఅయితే రాష్ట్ర ప్రభుత్వం అరెస్ట్ చేసినా, ఏ కేసు నమోదు చేసినా అది జగన్ కు ప్లస్ గా మారి వచ్చే ఎన్నికల్లో తమకు నష్టం చేకూరుస్తుందని నలభై ఐదేళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుకు తెలియంది కాదు. అందుకే రాష్ట్ర పరిధిలో కాకుండా కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి నెట్టే ప్రయత్నం చేస్తున్నట్లే కనపడుతుంది. జగన్ కు ప్రధానంగా మద్యం కుంభకోణం మెడకు చుట్టుకునేలా ఉంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే స్పెషల్ ఇన్విస్టిగేషన్ టీం ను ఏర్పాటు చేసింది. ఈ టీం మద్యం కుంభకోణంలో కీలక సూత్రధారులను ఇప్పటికే అరెస్ట్ చేసింది. రాజ్ కసిరెడ్డితో పాటు చాణక్య, దిలీప్ ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. అయితే తాజాగా ఈ మద్యం కుంభకోణం కేసులో ఈడీ ఎంటర్ కావడమే ఇప్పుడు ట్విస్ట్కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థ ఈడీ మద్యం కుంభకోణానికి సంబంధించిన వివరాలను అందించాలని స్పెషల్ ఇన్విస్టిగేషన్ టీం ను కోరినట్లు తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వేలాది కోట్ల రూపాయలు చేతులు మారాయని, మనీలాండరింగ్ కూడా పెద్దయెత్తున జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ విచారణకు సిద్ధమయింది. అంటే ఒక రకంగా కేంద్ర ప్రభుత్వం నుంచి జగన్ కు స్పష్టమైన సంకేతాలు అందినట్లే అనుకోవాలి. మనీలాండ్ రింగ్ చట్టకింద ఈకేసును టేకప్ చేసిన ఈడీ కేసు నమోదు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఈడీ ఊరికే వచ్చి విచారణ చేస్తుందని అనుకోవడానికి వీలులేదు. దీని వెనక చంద్రబాబు నాయుడు ఉన్నారని వైసీపీ నేతలు ఇప్పటికే ఆరోపణలు చేస్తున్నారు.ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ రాజ్ కసిరెడ్డి తో పాటు వైసీపీ పార్లమెంటు సభ్యుడు పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డితో పాటు మరికొందరిని ఈడీ నిందితులుగా చేర్చడంతో ఇది జగన్ ను కూడా ఇరికించడానికి ముందస్తు ట్రయల్ అని ఈ కేసు తెలిసిన వారు అంటున్నారు. అయితే జగన్ మానసికంగా సిద్ధమయినప్పటికీ కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ తో పాటు సీబీఐ కూడా ఈ కేసులో ఎంటర్ అయ్యే అవకాశాలున్నాయని అంటున్నారు. అదే జరిగితే జగన్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు కూడా కేంద్ర ప్రభుత్వ సంస్థలు విచారించే అవకాశాలు కూడా లేకపోలేదని పలువురు న్యాయనిపుణులు చెబుతున్నారు. అదే జరిగితే చంద్రబాబు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించడలో సక్సెస్ అయినట్లేనని రాజకీయంగా కూడా కామెంట్స్ వినపడుతున్నాయి.

# చర్చానీయంగా జగన్ కామెంట్స్

**గుంటూరు :** ఎక్కడ ఉన్నా.. ఎవ్వర్నీ వదలబోం.. పార్టీ నాయకుల సమావేశంలో జగన్ చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా వైసీపీ సానుభూతిపరులను ఇబ్బంది పెడుతున్న పోలీసుల పేర్లు రాసిపెట్టండి అని జగన్ చెప్పడం హాట్ టాపిక్‌గా మారింది. ఈ వ్యాఖ్యలపై పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది'మన కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్న పోలీసు అధికారుల పేర్లు రాసుకోండి.. ఎవ్వరినీ వదలం.. సప్త సముద్రాల అవతల ఉన్నా విడిచిపెట్టం.. అధికారంలోకి వచ్చాక వారిని చట్టం ముందు నిలబెడదాం' అని వైసీపీ చీఫ్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కామెంట్స్‌పై ఇప్పుడు ఏపీ పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.'కేవలం వైసీపీని ప్రేమించినందుకు, పార్టీని అభిమానించినందుకు.. కార్యకర్తలు పడుతున్న బాధను చూశాను. అందుకే జగన్ 2.0 లో కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తా. ఈరోజు చంద్రబాబు, పోలీసులు చేస్తున్నది దుర్మార్గం. వారు ఏదైతే విత్తనం వేస్తున్నారో.. రేపు అదే పెరుగుతుంది. అందుకే ఈరోజు దౌర్జన్యాలు చేస్తున్న అధికారులు, పోలీసులు.. ఆరోజు ఎక్కడున్నా, రిటైర్ అయినా, సప్త సముద్రాల అవతల ఉన్నా వదిలిపెట్టం.. అది మామూలుగా ఉండదు' అని జగన్ వార్నింగ్ ఇచ్చారు.'ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను చూశాక నేను ఒకటే చెబుతున్నాను.. ఇప్పుడు బాధపడుతున్న కార్యకర్తలకు పూర్తి న్యాయం చేస్తాను. ఈరోజు తప్పుడు కేసులు, తప్పుడు సాక్ష్యాలు. సంబంధం లేకున్నా కేసుల్లో ఇరికిస్తున్నారు. ఇలాంటి రాజకీయాలు గతంలో ఏనాడూ చూడలేదు. చంద్రబాబు ఇవన్నీ ఎందుకు చేస్తున్నాడంటే.. ఆయన ప్రజల్లో చులకన అయ్యారు. హామీలు అమలు చేయడం లేదు. దీంతో ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోంది. కాబట్టి, ఎవరూ ప్రశ్నించకూడదని, రాష్ట్రంలో భయానక పరిస్థితి సృష్టిస్తున్నాడు' అని జగన్ వ్యాఖ్యానించారు'ఎక్కడ ఏ సమస్య వచ్చినా, ప్రజల్లో వ్యతిరేకత కనిపించినా, వెంటనే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. ఒకరోజు తిరుపతి లడ్డూ అంటారు. ఇంకోరోజు సినీ నటి కేసు అంటారు. చూస్తుండగానే ఏడాది గడిచింది. కళ్లు మూసుకుని తెరిస్తే మూడేళ్లు గడుస్తాయి. మనం గట్టిగా నిలబడి మూడేళ్లు ఇలాగే పోరాడితే.. ఆ తర్వాత వచ్చేది కచ్చితంగా మన ప్రభుత్వమే. ఇప్పుడు మిమ్మల్ని వేధిస్తున్న వారెవ్వరినీ వదిలిపెట్టబోము' అని జగన్ స్పష్టం చేశారు.జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు.. అటు రాజకీయ నాయకుల్లో.. ఇటు పోలీసు వర్గాల్లో చర్చకు దారితీశాయి. గతంలో కూడా జగన్ కొందరు పోలీసు అధికారుల పేర్లు చెప్పిమరీ వార్నింగ్ ఇచ్చారు. కానీ.. నేరుగా పేర్లు రాసిపెట్టండి.. తర్వాత వాళ్ల సంగతి చెబుదాం అని ఎప్పుడూ అనలేదు. దీంతో పోలీసుల్లో జగన్ కామెంట్స్‌పై చర్చ జరుగుతోంది. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో పనిచేసే ఎస్సై, సీఐ, డీఎస్పీ స్థాయి అధికారులు దీనిపై చర్చించుకుంటున్నారు.జగన్ చేసిన ఈ కామెంట్స్ వైసీపీలో జోష్ నింపాయని.. ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు చెప్పారు. 'వాస్తవానికి క్షేత్ర స్థాయిలో మా పార్టీ కార్యకర్తలు, నాయకులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే చాలామందిపై తప్పుడు కేసులు నమోదు చేశారు. చిన్న చిన్న వ్యాపారం చేసుకునే వైసీపీ సానుభూతిపరులను ఇబ్బంది పెడుతున్నారు. ఇవన్నీ జగన్ దృష్టికి తీసుకెళ్లాం. వారికి మనం అండగా నిలుద్దామని జగన్ హామీ ఇచ్చారు'

## పాకిస్థాన్ దృశ్చర్యలను ప్రతిఒక్క భారతీయుడు తిప్పికొట్టాలి

**హైదరాబాద్ :** హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో... ఉర్దూ జర్నలిస్ట్ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో... మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వసలహాదారుడు షబ్బీర్ అలీలతో కలిసి ఒవైసీ పాల్గొన్నారు.ఉర్దూ జర్నలిస్టులకు అవార్డులు అందజేసిన అనంతరం ఓవైసీ మాట్లాడుతూ... ఇస్లాం పేరుతో పాకిస్తాన్ మారణహోమం సృష్టిస్తుందని విమర్శించారు.??భారతదేశం నుండి విడిపోయిన తరువాత పాకిస్తాన్... ఇక్కడి హిందువులకు, ముస్లిం ల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టాలని చూసింది. పెహల్గామ్ లో కుటుంబ సభ్యుల ముందు అతికిరతకంగా హతమార్చారు. అందుకు ప్రతీకారంగా ఆపరేషన్ సింధూర్ తో భారత సైనికులు సరైన సమాధానం ఇస్తున్నారు. పాకిస్తాన్ ఆర్మీ సివిలియన్స్ టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడుతుందని... దానికి తగిన మూల్యం చెల్లించుకుంటుంది. భారతదేశ ముస్లింలు దేశం కోసం ప్రాణాలు ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నారని, సైనికులకు అండగా ఉంటామని ఒవైసీ స్పష్టం చేశారు.

# హిందువులను సంఘటితం చేయడమే లక్ష్యంగా "హిందూ ఏక్తా యాత్ర"

**- భాజపా పట్టణాధ్యక్షులు : రాపెల్లి శ్రీధర్**

**- వేములవాడలో "హిందూ ఏక్తా యాత్ర" గోడప్రతి ఆవిష్కరణ**



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో హిందూ ఏక్తా యాత్ర గోడప్రతిని శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాజపా పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ, "గత పదిహేను సంవత్సరాలుగా హనుమాన్ జయంతిని పురస్కరించుకొని హిందువులను సంఘటితం చేయడమే లక్ష్యంగా "హిందూ ఏక్తా యాత్ర " నిర్వహించడం జరుగుతుందని,ఈ యాత్రను కేంద్రమంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు అని తెలిపారు.ఈ నెల 22న కరీంనగర్‌లో నిర్వహించే యాత్రకు వేములవాడ నుంచి పెద్ద సంఖ్యలో హిందువులు తరలిరావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. యాత్ర విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు.అనంతరం ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ, దేశంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని హిందువులు ఐక్యత ప్రదర్శించాల్సిన సమయం ఇదే అన్నారు. వేములవాడ వంటి పవిత్ర క్షేత్రం నుంచి పెద్ద ఎత్తున హిందువులు కరీంనగర్ యాత్రకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కోల కృష్ణ, రేగుల మల్లిఖార్జున్,రేగుల రాజ్ కుమార్,వివేక్ రెడ్డి, కట్కం శ్రీనివాస్,అన్నం నరసయ్య,గుంటి కనకయ్య, గుడిసె మనోజ్,వాసం మల్లేశం, బిల్ల కృష్ణహరి, సగ్గు రాహుల్, నామాల శేఖర్,సాయి,రేగుల శ్రీకాంత్,రంజిత్ రెడ్డి,తడుక రాజు,బచ్చు వంశీ,నాగరాజు, హరీష్ తదితర భాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక పరిపుష్టే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి పొంగూరు నారాయణ



నెల్లూరు ( ప్రశ్న న్యూస్)నగరంలోని రంగనాయకులపేట గొల్లవీధి వద్ద సచివాలయంలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ మహిళలందరూ స్వయం ఉపాధి పొందాలని, స్వశక్తితో గౌరవంగా జీవించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత టైలరింగ్ కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని మంత్రి నారాయణ చెప్పారు. ఇందులో భాగంగా నెల్లూరు సిటీ నియోజకవర్గంలో ఉచిత టైలరింగ్ కేంద్రాలు ప్రారంభించినట్లు చెప్పారు. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో టైలరింగ్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి ఆర్థికంగా వెనుకబడిన బీసీలు, ఓసీలకు చెందిన మహిళలందరికీ ఉచితంగా 90 రోజులపాటు టైలరింగ్ శిక్షణ ఇచ్చి మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేయనున్నట్లు చెప్పారు. ఈ శిక్షణ కేంద్రంలో 70 మందికి రెండు బ్యాచ్ లుగా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అర్హత గల ప్రతి ఒక్క మహిళకు కూడా శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టు మిషన్ అందిస్తామని, మహిళందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మంచి వృత్తి నైపుణ్యం పెంపొందించుకొని స్వయం ఉపాధి పొందాలని మంత్రి పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లాలో 4967 మంది మహిళలకు ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లు అందిస్తామన్నారు. టైలరింగ్ శిక్షణకు ఒక్కొక్క మహిళపై రూ. 21798/-లు ప్రభుత్వం ఖర్చు చేస్తుందని, జిల్లాలో రూ. 10.80 కోట్లు శిక్షణ కేంద్రాలకు ఖర్చు చేస్తున్నట్లు మంత్రి నారాయణ వివరించారు. ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు టైలరింగ్ శిక్షణ ఇచ్చి వృత్తి నైపుణ్యం పెంపొందించి... వారు ఆర్థికంగా అభివృద్ధి సాధించడమేఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశంగా మంత్రి నారాయణ ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ నందన్, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, స్థానిక ప్రజా ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

# అమరవీరుడు మురళి నాయక్‌కి నివాళులర్పించిన: తంగిరాల సౌమ్య



నందిగామ (ప్రశ్న న్యూస్) పట్టణం కాకాని నగర్ నందు శనివారం నాడు దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళి నాయక్ చిత్రపటానికి కూటమి నేతలతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఏపీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# అన్ని వర్గాల సంక్షేమాభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కృషి చేస్తోంది

**- చొప్పదండి ఎమ్మెల్యే : డాక్టర్ మేడిపల్లి సత్యం**

**- ఎమ్మెల్యే సత్యం చేతుల మీదుగా అంధునికి రూ.50,000 చెక్కు అందజేత**



**బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్)** చొప్పదండి నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం శనివారం బోయినిపల్లి మండల పర్యటనలో భాగంగా మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన అంధుడు కన్నం ప్రభాకర్‌కు జీవనోపాధి కోసం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో రూ.50,000 చెక్కును ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమాభివృద్ధికై కృషి చేస్తోందని తెలిపారు.

# గ్రామాల అభివృద్దే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

**- చొప్పదండి ఎమ్మెల్యే : మేడిపల్లి సత్యం**

**- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సత్యం**







**బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని గుండన్నపల్లిలో రూ.8 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రహదారి పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తుందని పేర్కొన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అలాగే స్తంభంపల్లి గ్రామంలో ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించబోయే సుగ్రీవ ఆలయానికి శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తి అయ్యేలా సంబంధిత మంత్రితో చర్చించి చర్యలు తీసుకుంటానని తెలిపారు.ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 50,000 రూపాయల చెక్కును జీవనోపాధి కోసం అంధుడైన కన్నం ప్రభాకర్‌కు ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం పలువురు నేతలు ఎమ్మెల్యే ను శాలువాలతో ఘనంగా సన్మానించారు.అనంతరం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, మండలంలోని ప్రతి గ్రామానికి సీసీ రహదారులు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు మూడు కోట్ల 10 లక్షల రూపాయలతో రహదారుల మంజూరు జరిగిందని తెలిపారు. కొండపోచమ్మ ఆలయానికి రోడ్డు లేక ఇబ్బందులు తలెత్తడంతో రూ.50 లక్షలతో రహదారి నిర్మాణం చేపట్టినట్టు వెల్లడించారు.గత ప్రభుత్వ హయాంలో మాడల్ స్కూల్‌కు కనీస అవసరాలు కూడా అందలేదని, ఇప్పుడు 25 లక్షల రూపాయలతో స్కూల్‌కు రహదారి నిర్మాణం పూర్తి చేసినట్టు వివరించారు. బోయినిపల్లి మండలానికి సీఆర్ఆర్ గ్రాంట్, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ద్వారా రూ.1.60 కోట్ల నిధులు మంజూరైనట్టు వెల్లడించారు. వీటి ద్వారా 23 గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీం రెడ్డి మహేశ్వర్ రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కౌడగాని వెంకటేష్, తదితర మండల కాంగ్రెస్ నేతలు,గ్రామ నేతలు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్దే లక్ష్యం గా సబ్సిడీ రుణాలు-ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్



నగరి(ప్రశ్న న్యూస్) మహిళలు స్వయం ఉపాధి పొంది తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తున్నారని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. వడమాలపేట మండలం దళిత వాడ కు చెందిన కే. కావ్య, ఎనమల పాలెం దళిత వాడకు కు చెందిన సత్య, అప్పలాయగుంట దళిత వాడకు చెందిన గుణ లకు ప్రధానమంత్రి అజయ్, ఉన్నతి పథకం క్రింద ఒక్కొక్కరికి రు. 1,00,000/- చెక్కు ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పంపిణీ చేశారు..

# శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎండి ఫయాజ్



**నంద్యాల (ప్రశ్న న్యూస్)** నియోజకవర్గం గోస్పాడు గ్రామంలో నూతన శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు . ఈ సందర్భంగా ఎన్ఎండి ఫయాజ్ మాట్లాడుతూ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు గోస్పాడు ప్రజలను ఆ దేవుడు చల్లగా చూడాలని నంద్యాల నియోజకవర్గ అభివృద్ధి పథంలో నడిపే విధంగా శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆశీస్సులు నంద్యాల నియోజకవర్గం పై ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో గోస్పాడు మండల టిడిపి కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి , వీరసింహారెడ్డి , వీరారెడ్డి , తేలపురి సర్పంచ్ సుధామణి , కాంట్రాక్టర్ రవి , పెద్ద ఓబుల్ పతి , మద్దిలేటి , మనోహర్ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ప్రతి పోలీస్ అధికారి నైపుణ్యం పెంపొందించుకోవాలి:ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్



ఒంగోలు (ప్రశ్న న్యూస్)ప్రతి పోలీసు స్టేషన్లులో నమోదవుతున్న కేసుల్లో నిందితులకు శిక్షలు పడాలంటే దర్యాప్తు అధికారులు నేర స్థలం నుండి శాస్త్రీయ పద్ధతిలో ఆధారాలను సేకరించడం, వాటిని పరీక్షల కొరకు ఫోరెన్సిక్ ల్యాబ్ లకు పంపడం చాలా ముఖ్యమని జిల్లా ఎస్పీ అన్నారు. జిల్లాలో పని చేస్తున్న దర్యాప్తు అధికారులకు ఫారెన్సీక్ ఎవిడెన్స్ మేనేజ్మెంట్ పై ప్రముఖ నిపుణులచే ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిధిగా హాజరై, శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ ప్రతి దర్యాప్తు అధికారి మంచి నైపుణ్యం కలిగి ఉండాలని రాష్ట్ర డి.జి.పి హరీష్ కుమార్ గుప్తా, ఆదేశాల మేరకు ఫోరెన్సిక్ పై ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ప్రతి రోజు స్టేషనుల్లో నమోదవుతున్న క్రిమినల్ కేసుల్లో పోలీస్ అధికారికి ఏదో ఒక రూపంలో సవాలు ఎదురవుతూనే ఉంటుంది. నేరం జరిగే తీరు ఆధారంగా కొన్ని క్లిష్టతరమైనదిగా, మరికొన్ని సులభతరంగా ఛేదించే విధంగా ఉంటాయని, కానీ ఒక నేరం జరిగిన తీరును బట్టి ఏ విధంగా జరిగింది, దానిని ఎవరు చేశారు, నేరానికి దారి తీసిన అంశాలు మొదలైనవి తెలుసుకునేందుకు ప్రతి పోలీసు అధికారి సంపూర్ణ నిష్ణాతుడు కావాలని, నేర స్థలం నుండి ఆధారాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించడం, వాటిని ప్యాకింగు చేయడం, పరీక్షల కొరకు సకాలంలో ఫోరెన్సిక్ ల్యాబ్ లకు పంపడం చాలా ముఖ్యమైన విషయమన్నారు. నేరం చేసిన నిందితులు ఎట్టి పరిస్థితుల్లో శిక్ష నుండి తప్పించుకోకూడదని, నేరం చేసిన వారికి చట్ట ప్రకారం తప్పకుండా శిక్ష పడాలి అంటే నేరస్థుడు నేర స్థలంలో వదిలిన భౌతిక సాక్షాధారాలను సేకరించే సమయంలో పాటించవలసిన నియమ నిబంధనలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞాన సహాయంతో సాక్ష్యాలను సేకరించే విధానం వంటి అంశాలపై ప్రతి అధికారి మంచి నైపుణ్యం కలిగి ఉండాలని ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. నేర్చుకున్న ప్రతి అంశం దర్యాప్తు వేగవంతంగా పూర్తి అ వ్వడానికి, నేరస్థులకు త్వరితగతిన శిక్షపడేలా చేయడానికి, సహాయపడుతుందని ఎస్పీ తెలిపారు.

# యుద్ధాన్ని ఆపండి శాంతిని కాపాడండి

**- డి-ఎస్కలేట్ శత్రుత్వం కాకుండా-దౌత్యం ద్వారా పరిష్కారాలను సాధించండి**

CPI [M]

విజయవాడ ( ప్రశ్న న్యూస్) కాశ్మీర్ పహల్గామ్‌లో జరిగిన భయంకరమైన ఉగ్రవాద దాడి తరువాత, భారతీయ సాయుధ దళాలు సైనిక సమ్మెలు ప్రతిస్పందనగా, ఉగ్రవాద దుస్తులను తటస్తం చేయడమే లక్ష్యంతో, ఉగ్రవాద దాడులను కలిగి ఉన్న ఉగ్రవాద దుస్తులను తటస్థీకరించడం భారతదేశం, పాకిస్తాన్ల మధ్య ఉద్రిక్తతకు కారణమైంది. ఇది స్నోబాల్‌కు పూర్తి స్థాయి వినాశకరమైన యుద్ధానికి కనిపిస్తుంది. అందరికీ విపత్తు తెచ్చే యుద్ధాన్ని అగ్రశ్రేణి ప్రాధాన్యతతో తీవ్రమైన ప్రయత్నాలతో ఆగిపోవాలని కోరుతున్నాము. శాంతిని చాలా ఉద్దేశపూర్వక ఓర్పుతో భద్రపరచాలి. శత్రుత్వాల పెరుగుదల స్పృహతో నిరోధించాలి. మేము చెప్పిన లక్ష్యాలను సాధించడంలో విఫలమైతే, ప్రతికూలతలు భయానకంగా ఉంటాయి. భారతదేశం, పాకిస్తాన్ మధ్య శత్రుత్వాన్ని శాశ్వతం చేస్తాయి. ఉగ్రవాద రాక్షసులను అపారమైన మరణాలు, రక్తపాతంతో పోషించడానికి ఇది భూమిని విస్తృతం చేస్తుంది. నాశనం చేయబడిన ఒక ఉగ్రవాద శిబిరం ఈ రకమైన బహుళ వాటిని కలిగి ఉండవచ్చు. ఇది మన దేశంలో కూడా క్రూరమైన మత వివక్షతను ప్రేరేపించడానికి కారణం కావచ్చు. మన సమాజంలోని లౌకిక సోదర మతాలను ప్రమాదకరంగా చీల్చడమౌతుంది.ఇంకా, అటువంటి యుద్ధం సాధారణంగా సామ్రాజ్యవాద శిబిరం యొక్క నరక శక్తులను, ముఖ్యంగా యుఎస్ సామ్రాజ్యవాదం యొక్క విభజించు, పాలించు సిద్ధాంతం యొక్క దుష్ట దరఖాస్తును తీవ్రతరం చేయడానికి ఉత్సాహంగా ఉంటుంది. వారు పెంపకం, ఈ ప్రాంతంలో మతపరమైన మతోన్మాదాన్ని, ఉగ్రవాదాన్ని చాలా కాలం నుండి తీసుకువచ్చారు. ఇప్పుడు కూడా, యుఎస్, యుకె వంటి సామ్రాజ్యవాద దేశాలు నిష్క్రియాత్మకంగా ఆడుతున్న సామ్రాజ్యవాద దేశాలు నిస్సహాయంగా, డి-ఎస్కలేషన్ కోసం ఒప్పించడంలో ఏమైనా సహకారం యొక్క నిస్సహాయత. అంతేకాకుండా, ఒక పాపిష్ యుద్ధం యొక్క కష్టాలు, ప్రమాదాలు కార్మికవర్గం, రైతుల, వినయపూర్వకమైన జీవిత ప్రజలందరూ వారి చిన్న నివాస ప్రదేశాలలో, ముఖ్యంగా సరిహద్దుల దగ్గర రోజువారీ రొట్టె కోసం పనిచేసే, శ్రమించే వినయపూర్వకమైన జీవిత ప్రజలందరిపై పడటం ఖాయం. దేశం, దాని శ్రమించే తరగతులు, శాంతి-ప్రేమగల ప్రజలు, వారి ప్రజాస్వామ్య, లౌకిక కోరికలు, సంపన్న భవిష్యత్తు యొక్క కలలు ఒక దుష్ట యుద్ధం విచ్ఛిన్నమైతే స్మిథరీన్స్కు ముక్కలు చేయబడతాయి. ఇది జింగోయిజాన్ని నడిపించే అన్ని రకాల ఉగ్రవాదం, ఉగ్రవాదం యొక్క సూక్ష్మక్రిములు, మహమ్మారిని రెట్టింపు చేస్తుంది, ఇది అణు దాడుల సామర్థ్యాన్ని కలిగి ఉన్న రెండు దేశాల మధ్య మతిస్థిమితం లేని శత్రుత్వానికి స్వయంగా నడిపిస్తుంది. పైన పేర్కొన్నది, పరిపక్వ స్థితి యొక్క ప్రమాదకరమైన రాజనీతిజ్ఞత, వివేకాన్ని అస్పష్టం చేస్తుంది. ఇది మొత్తం హోలోకాస్టల్ విధ్వంసం మాత్రమే. కాబట్టి, మన దేశం, పాకిస్తాన్ మధ్య అన్ని రకాల సాయుధ చర్యలు, విభేదాల వల్ల సంభవించే శత్రుత్వాన్ని వెంటనే పెంచే డిమాండ్‌ను మేము గట్టిగా వ్యతిరేకిస్తాం. శత్రుత్వాలను తక్షణమే విరమించుకోవడానికి, అత్యవసర సమస్యల పరిష్కారాలను కనుగొనటానికి, ఈ శత్రుత్వాలకు దారితీసిన కార్డినల్, వ్యూహాత్మక వ్యత్యాసాలను పరిష్కరించడానికి దీనిని కొనసాగించడానికి దౌత్య నిశ్చితార్థాల కోసం సాధ్యమయ్యే అన్ని తలుపులు వెంటనే తెరవాలని మేము కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాము. దీనిని సాధించినందుకు అందరి ప్రజాస్వామ్య, శాంతి-ప్రేమగల ప్రజలందరినీ ఐక్యతతో సమకూర్చాలని మేము కోరుతున్నాము. అన్ని రాజకీయ పార్టీలకు, ఇతర ప్రసిద్ధ సంస్థలకు మార్గదర్శకుడు. యుద్ధం యొక్క చెడు ఉన్మాదానికి వ్యతిరేకంగా శాంతి జ్ఞానం యొక్క ధర్మాన్ని వ్యక్తీకరించడానికి మేము ప్రయత్నిస్తున్నాము.

# ప్రయాణికురాలి బ్యాగ్ ను అప్పగించిన పోలీసులు




**ఏలూరు** రైలులో ప్రయాణిస్తున్న ప్రయాణికురాలు పోగొట్టుకున్న బ్యాగును రైల్వే పోలీసులు తిరిగి ఆమెకు అప్పగించారు. విజయవాడకు చెందిన రమాదేవి తిరుపతి వెళ్లి తిరుగు ప్రయాణంలో విజయవాడకు రైల్లో శనివారం ఉదయం వచ్చింది. రైలులో ఆమె బ్యాగును మర్చిపోయింది. వెంటనే విజయవాడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. విజయవాడ పోలీసులు, ఏలూరు రైల్వే పోలీసులను అలర్ట్ చేశారు. ఆ బ్యాగ్ ను ఏలూరు రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని తిరిగి రమాదేవికి అప్పగించారు.

# నేను హీరో అని నాకు తెలియకుండానే సినిమా తీసేశారు: వెన్నెల కిశోర్



తాను కథానాయకుడిగా నటించినట్లు తనకే తెలియకుండా ఒక సినిమా పూర్తయిందంటూ హాస్య నటుడు వెన్నెల కిశోర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' చిత్రంలో వెన్నెల కిశోర్ ప్రధాన పాత్ర పోషించారు. అయితే, ఈ సినిమాలో తనే హీరో అనే విషయం తనకు ముందుగా తెలియదని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, ఈ సినిమా ప్రచార కార్యక్రమాలకు వెన్నెల కిశోర్ హాజరుకాకపోవడంపై చిత్ర బృందం స్పందిస్తూ... ఆ విషయం గురించి ఆయన్నే అడగాలని పేర్కొనడం గతంలో వార్తల్లో నిలిచింది. ఈ నేపథ్యంలో వెన్నెల కిశోర్ తాజాగా ఈ విషయంపై స్పందించారు. "ఈ సినిమాలో నేను హీరో అనే సంగతి నాకు తెలియదు. నాకు ముందుగా సినిమా కథ మొత్తం చెప్పలేదు. ఈ మధ్య నేను అలా అడగడం కూడా మానేశాను, ఎందుకంటే కొందరు కథ మొత్తం అడిగితే ఇబ్బందిగా ఫీలవుతున్నారు. అందుకే, నా పాత్ర పరిధి వరకే చెప్పమని అడిగాను, వారు చెప్పారు. ఏడు రోజుల కాల్షీట్లు ఇచ్చి, నా పాత్రకు సంబంధించిన చిత్రీకరణ పూర్తిచేశాను. ఆ తర్వాత కొన్ని భావోద్వేగ సన్నివేశాలు జోడించాల్సి ఉందని చెప్పడంతో, వెళ్లి నటించి వచ్చాను" అని వెన్నెల కిశోర్ వివరించారు.సినిమా విడుదల సమయంలో తనే హీరో అని పోస్టర్లలో చూడటం తనకు ఆశ్చర్యం కలిగించిందని ఆయన అన్నారు. "అసలు నాకే తెలియకుండా నన్ను హీరోగా ఎలా చేశారో అర్థం కాలేదు. నాకు కథ చెప్పినప్పుడు ఈ సినిమాలో వేరే హీరో ఉన్నాడని, అతనికి జోడీగా అనన్య నాగళ్ల నటిస్తోందని చెప్పారు. కానీ చివరికి నన్ను హీరోగా ప్రాజెక్ట్ చేస్తూ ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చారు. ఈ విషయం నాకు తెలియకుండానే జరిగింది" అని కిశోర్ పేర్కొన్నారు. ఒకవేళ దర్శకనిర్మాతలు తానే హీరోనని ముందుగా స్పష్టం చేసి ఉంటే, తాను కూడా ప్రచార కార్యక్రమాలకు వచ్చి ఉండేవాడినేమో అని చెప్పారు.

### భారత్-పాక్ సరిహద్దు

## ఉద్రిక్తతపై జాన్వీ కపూర్ ఆందోళన

**- సోషల్ మీడియాలో భావోద్వేగ పోస్ట్**

భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా ఆమె స్పందిస్తూ.. వార్తా ఛానెళ్లు, సామాజిక మాధ్యమాల్లో చోటు చేసుకున్న సరిహద్దు ఘటనల దృశ్యాలు సినిమా సన్నివేశాలను తలపించాయని, ఇటువంటి పరిస్థితులను తాను జీవితంలో చూస్తానని ఊహించలేదని జాన్వీ తెలిపారు. సరిహద్దుల్లో నెలకొన్న గందరగోళం తనను తీవ్ర కలవరానికి గురిచేసిందని ఆమె పేర్కొన్నారు. "ఇన్నాళ్లూ విదేశాల్లో ఇలాంటి దాడులు జరిగినప్పుడు శాంతి కోసం కోరుకున్నాం. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మన తలుపు వద్దకు చేరింది," అని జాన్వీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘర్షణకు దారితీసిన ఆగ్రహం, నొప్పి తనకు అర్థమవుతున్నాయని, అయితే ఇరువైపులా అమాయక ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లడం తనను భయానికి గురిచేస్తోందని ఆమె అన్నారు. ఏ కారణంతోనైనా అమాయకులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత దారుణమని జాన్వీ అభిప్రాయపడ్డారు. "ఇది భారతీయ స్వభావానికి విరుద్ధం. మనం ఎప్పుడూ దురాక్రమణదారులం కాదు. ఇతరుల భూభాగంలోకి చొరబడటం, మనల్ని ఆహ్వానించని వారిపై మన అభిప్రాయాలను రుద్దటం మన సంప్రదాయం కాదు," అని ఆమె స్పష్టం చేశారు. దశాబ్దాలుగా పిరికి దాడులను ఎదుర్కొన్న భారత్, ఇప్పుడు గట్టిగా తిరిగి కొట్టిందని, ఇకపై సహనం చూపేది లేదని స్పష్టమైన సందేశం ఇచ్చిందని జాన్వీ అన్నారు. మన సాయుధ దళాల శక్తి సామర్థ్యాలపై తనకు పూర్తి నమ్మకం ఉందని, ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనే సామర్థ్యం వారికి ఉందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. "మన వైమానిక దళం, నౌకాదళం, సైన్యం తమ ధైర్యసాహసాలతో విజయం సాధిస్తాయి. ఒక్క భారతీయుడికి కూడా హాని జరగకుండా కాపాడతాయి," అని జాన్వీ పేర్కొన్నారు.



# రొట్టె విరిగి నేతిలో పడిందా?

'కేజీఎఫ్' ఫ్రాంచైజీతో నటిగా దేశానికి పరిచయమైంది శ్రీనిధి శెట్టి. ఆ తర్వాత అవకాశాలు కూడా ఈ కన్నడ కస్తూరిని బాగానే వరించాయి. కానీ శ్రీనిధి మాత్రం వచ్చిన ప్రతి అవకాశాన్నీ అందిపుచ్చుకోలేదు. నచ్చిన సినిమాకు మాత్రమే గ్రీన్ సిగ్నల్ ఇస్తూ.. ప్లాన్ ప్రకారం ముందుకెళ్తున్నది. ఈ క్రమంలోనే చియాన్ విక్రమ్‌తో 'కోబ్రా' సినిమాలో నటించిందీ అందాలభామ. అయితే ఆ సినిమా తనకు చేదు అనుభవాన్నే మిగిల్చింది. అయితే.. రీసెంట్‌గా వచ్చిన 'హిట్ 3'తో మళ్లీ భారీ విజయాన్ని ఖాతాలో వేసుకున్నది శ్రీనిధి శెట్టి.ఇదిలావుంటే.. ప్రస్తుతం ఫిల్మ్ సర్కిల్స్‌లో శ్రీనిధి శెట్టికి సంబంధించిన ఓ వార్త బలంగా వినిపిస్తున్నది. అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ నటించనున్న పాన్ ఇండియా సినిమాలో కథానాయికగా శ్రీనిధి శెట్టి ఎంపికైందనేది ఈ వార్త సారాంశం. ఈ కథలో ముగ్గురు కథానాయికలకు చోటున్నదట. అందులో మెయిన్ హీరోయిన్‌గా శ్రీనిధి శెట్టిని ఎంపిక చేసినట్టు సమాచారం. ఇదే గనుక నిజమైతే ఈ అందాలభామ రొట్టె విరిగి నేతిలో పడ్డట్టే.



## నా దేశం కోసం నిలబడతా...

**- ఎవరికీ క్షమాపణ చెప్పను: సెలీనా జైట్లీ**



ఆస్ట్రేలియాలో నివసిస్తున్న ప్రముఖ బాలీవుడ్ నటి సెలీనా జైట్లీ, ఇటీవల భారత సాయుధ దళాలను, దేశాన్ని ప్రశంసిస్తూ చేసిన పోస్టులపై కొందరు నెటిజన్లు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ ట్రోల్స్‌కు సెలీనా జైట్లీ తనదైన శైలిలో ఘాటుగా బదులిచ్చారు. తాను ఎప్పటికీ ఉగ్రవాదానికి వ్యతిరేకినేనని, దేశభక్తి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఆమె స్పష్టం చేశారు. భారతదేశం పట్ల, ఇక్కడి సాయుధ బలగాల పట్ల తనకున్న అభిమానాన్ని వ్యక్తం చేస్తూ సెలీనా జైట్లీ ఇటీవల సోషల్ మీడియాలో కొన్ని పోస్టులు చేశారు. దీంతో కొందరు వ్యక్తులు ఆమెను లక్ష్యంగా చేసుకుని ట్రోలింగ్‌కు దిగారు. భారత్‌ను పొగిడితే అన్‌ఫాలో చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో, సెలీనా తాజాగా ఒక ప్రకటన విడుదల చేస్తూ తనపై వస్తున్న విమర్శలకు సమాధానమిచ్చారు. "భారత్ గురించి మాట్లాడితే అన్‌ఫాలో చేస్తామని కొందరు నన్ను బెదిరిస్తున్నారు. అలాంటి వారందరి కోసమే ఈ పోస్ట్. నా దేశం కోసం నిలబడినందుకు నేను ఎప్పటికీ ఎవరికీ క్షమాపణలు చెప్పను" అని సెలీనా తన ప్రకటనలో పేర్కొన్నారు. ఉగ్రవాదం పేరిట అమాయకుల ప్రాణాలను బలిగొంటుంటే తాను మౌనంగా ఉండలేనని ఆమె తేల్చిచెప్పారు. "ఎంతోమంది అమాయకుల ప్రాణాలు తీశారు. హింసను సమర్థిస్తూ, దాన్ని ప్రోత్సహించే వారివైపు నేను ఎప్పుడూ నిలబడను" అని ఆమె స్పష్టం చేశారు. భారత్‌పై తనకున్న ప్రేమ ఇతరులను బాధిస్తే, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తాను చేసే వ్యాఖ్యలు వినలేకపోతే, సోషల్ మీడియాలో తనను అనుసరించడం మానేయవచ్చని సెలీనా సూటిగా చెప్పారు. "నేను శాంతి కోసం మాట్లాడతాను. సత్యం కోసం నిలబడతాను. ఎప్పుడూ నా సైనికుల వెంటే ఉంటాను. ఎందుకంటే నా సైనికులు పేరు, మతం అడగకుండానే రక్షిస్తారు. మీ అందరి ట్రోల్స్, బెదిరింపులు నేను గమనిస్తూనే ఉన్నాను. నేను ఇలాంటి వారిని క్షమించను. జైహింద్" అంటూ తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా వ్యక్తం చేశారు.

# డబ్బుంటే ఇండియానే బెటర్..

**- హైదరాబాద్ ముందు న్యూయార్క్ దిగదుడుపే: నటి లయ**

ఒకప్పటి ప్రముఖ సినీ నటి లయ, ప్రస్తుతం అమెరికాలో స్థిరపడినప్పటికీ, భారతదేశంపై, ముఖ్యంగా హైదరాబాద్ నగరంపై తనకున్న అభిమానాన్ని వ్యక్తం చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, హైదరాబాద్ అభివృద్ధిని చూసి తాను ఎంతగానో ముగ్ధురాలినయ్యానని, ఈ నగరం ముందు న్యూయార్క్ కూడా సరిపోదని ఆమె వ్యాఖ్యానించారు. మంచి జీవన ప్రమాణాలకు సరిపడా ఆర్థిక వనరులుంటే భారతదేశంలో ఉండటమే ఉత్తమమని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా లయ మాట్లాడుతూ, "ఈసారి ఇండియా వచ్చి హైదరాబాద్‌ను చూస్తే చాలా ఆశ్చర్యం వేసింది. నగరం ఎంతగా మారిపోయిందో! ఫ్లైఓవర్లు, ఆకాశహర్మ్యాలు చూస్తుంటే అద్భుతంగా అనిపిస్తోంది. మా లాస్ ఏంజిల్స్ డౌన్‌టౌన్‌లోని నాలుగైదు పాత భవనాలతో పోలిస్తే హైదరాబాద్ ఎంతో అభివృద్ధి చెందింది. ఒకరిని మించి ఒకరు మంచి కట్టడాలు నిర్మిస్తున్నారు. తగినంత డబ్బు ఉండి, మంచి జీవనశైలి గడపగలిగితే ఇండియా ఎప్పుడూ ఉత్తమమైన ప్రదేశం అనడంలో ఎలాంటి సందేహం లేదు" అని తెలిపారు. అమెరికాలో భారతీయ ఆహారాన్ని, ముఖ్యంగా స్ట్రీట్ ఫుడ్ అయిన పానీపూరి, నిమ్మకాయ సోడా వంటివాటిని తాను ఎంతగానో మిస్ అవుతానని ఆమె చెప్పుకొచ్చారు. తన వృత్తి జీవితం గురించి ప్రస్తావిస్తూ, 2011లో ఐటీ ఇంజనీర్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించానని లయ తెలిపారు. సత్యం కంపెనీలో జీఈ క్లయింట్ కోసం పనిచేశానని, ఆ తర్వాత నాలుగేళ్ల విరామం తీసుకుని 2017లో ఒక డ్యాన్స్ స్కూల్‌ను ప్రారంభించానని చెప్పారు. "డ్యాన్స్ స్కూల్ చాలా బాగా నడిచింది. వరుసగా పోటీలు, షోలతో బిజీగా ఉండేవాళ్లం. కానీ, కోవిడ్ కారణంగా పరిస్థితులు మారాయి. ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించినప్పటికీ, గ్రూప్ డ్యాన్స్‌లకు అవసరమైన సమన్వయం కుదరడం కష్టంగా ఉండేది. దీంతో యూట్యూబ్‌లో డ్యాన్స్ వీడియోలు, ఆ తర్వాత షార్ట్స్, రీల్స్ చేయడం మొదలుపెట్టాం" అని ఆమె వివరించారు. నటనకు దూరమైన తర్వాత, ముఖ్యంగా మంచి ఫామ్‌లో ఉన్నప్పుడే పెళ్లి చేసుకుని వెళ్లడం వల్ల కొంతకాలం ఖాళీగా అనిపించిందని లయ అంగీకరించారు. "ఇది చాలా పెద్ద మార్పు. సిద్ధపడి తీసుకున్న నిర్ణయమే అయినా, కొన్నిసార్లు 'ఇప్పుడు నేనేంటి? కేవలం గృహిణినా?' అనిపించేది. ఆర్థికంగా ఎంత సౌకర్యంగా ఉన్నా, ఏదో ఒక పని చేస్తూ చురుగ్గా ఉండటం, సమాజంలో మనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవడం వల్ల కలిగే సంతృప్తి వేరు. డబ్బు సంపాదన కోసమే కాదు, యాక్టివ్‌గా, బిజీగా ఉండాలని, ప్రజల్లో ఒక మార్క్ సృష్టించాలని కోరుకుంటాను" అంటూ తన మనసులోని మాటను పంచుకున్నారు లయ.

# వసూళ్లలో కొంత భాగం సైనికుల సహాయనిధికి అందిస్తాం

'ఓవైపు మన సైనికులు దేశంకోసం పోరాడుతుంటే.. సినిమా సెలబ్రేషన్స్ చేసుకోవడం సరికాదు. అందుకే కేవలం ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెప్పుకోడానికి మాత్రమే ఈ ప్రెస్‌మీట్ పెట్టాం. మన సైనికులకు సపోర్ట్‌గా నిలవడమే కాకుండా, ఈ సినిమాకు వచ్చే వసూళ్లలో కొంత భాగం సైనికుల సహాయనిధికి అందజేయనున్నాం.' అని అల్లు అరవింద్ తెలిపారు. ఆయన సమర్పణలో శ్రీవిష్ణు కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'సింగిల్'. కేతిక శర్మ, ఇవానా కథానాయికలు. కార్తీక్‌రాజు దర్శకుడు. విద్య కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మాతలు. శుక్రవారం సినిమా విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో అల్లు అరవింద్ మాట్లాడారు. ఇంకా చెబుతూ 'ఉద్రిక్తతల నడుమ ఈ మూవీని విడుదల చేయడం కరెక్ట్ కాదేమోనని ముందు సందేహించాం. సినిమాకోసం వందలమంది పనిచేస్తారు. థియేటర్లపై వందల కుటుంబాలు ఆధారపడి ఉంటాయి. అందుకే తప్పుగా అర్థం చేసుకోరనే నమ్మకంతో సినిమాను విడుదల చేశాం. థియేటర్లలో ఆడియన్స్ రియాక్షన్స్ చూస్తే చాలా సంతోషంగా అనిపించింది. శ్రీవిష్ణు, వెన్నెలకిశోర్ అద్భుతంగా అలరించారు. ఇద్దరు హీరోయిన్లు చక్కగా నటించారు. అందరూ మెచ్చేలా సినిమాను తీసిన దర్శకుడికి అభినందనలు.' అని అల్లు అరవింద్ అన్నారు. ఇంకా హీరో శ్రీవిష్ణు, వెన్నెల కిశోర్, డైరెక్టర్ కార్తీక్‌రాజు, కేతిక శర్మ, ఇవానా, నిర్మాత విద్య కొప్పినీడి కూడా మాట్లాడారు.





## జర్నలిస్టులు కొత్తతరం పత్రికా రంగానికి ఆదర్శం కావాలి

- చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే :డాక్టర్ మేడిపల్లి సత్యం
- ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఘనంగా జర్నలిస్ట్ వేణుగోపాల్ జన్మదిన వేడుకలు





**బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్)** బోయినిపల్లి మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ నల్లగొండ వేణుగోపాల్ జన్మదిన వేడుకలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో వేడుకలు నిర్వహించబడ్డాయి. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,విలేకరుల సమక్షంలో కేక్ కట్ చేయించి, మిఠాయిలు పంచుతూ జర్నలిస్ట్ వేణుగోపాల్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "వేణుగోపాల్ పత్రికా రంగంలో తనదైన ముద్ర వేసిన విలేఖరి అని, నిష్పక్షపాతంగా,నిజాయితీతో తన వృత్తిని నిర్వర్తిస్తూ సమాజానికి చైతన్యం కలిగిస్తున్నారని, ఇలాంటి జర్నలిస్టులు కొత్త తరం పత్రికరంగానికి ఆదర్శం కావాలని అన్నారు.ఈ జన్మదిన వేడుకల్లో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికులకు అండగా నిలుస్తాం

- ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి
- సింగరేణి ప్రధాన కార్యాలయ సందర్శన డైరెక్టర్ (పా)తో సమీక్ష



**కొత్తగూడెం (ప్రశ్న న్యూస్)** నల్ల బంగారం వెలికితీస్తూ..శ్రమిస్తున్న సింగరేణి కార్మికులకు అండగా నిలుస్తామని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి అభయమిచ్చారు. శనివారం కొత్తగూడెం లోని సింగరేణి ప్రధాన కార్యాలయానికి వెళ్లి.. ఆ సంస్థ డైరెక్టర్ (పా) కే. వెంకటేశ్వర్లు, జీఎం, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో వైద్యుల కొరత లేకుండా చూడాలని, కార్మికులకు విధి నిర్వహణలో ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వ పరంగా సింగరేణికి పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో.. కాంగ్రెస్ జిల్లా నాయకులు, ఐఎన్టీయూసీ నాయకులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## స్టేషన్ పనులు పూర్తయ్యేదెప్పుడు

- ఎంపి రామ సహాయం రఘురాంరెడ్డి
- కొత్తగూడెం రైల్వే స్టేషన్ పనులు పరిశీలించిన ఎంపి
- పనుల జాప్యంపై ఆగ్రహం - త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు



**కొత్తగూడెం (ప్రశ్న న్యూస్ )** కొత్తగూడెం రైల్వే స్టేషన్ పనులు పూర్తి చేయడంలో జరుగుతున్న ఆలస్యంపై ఖమ్మం ఎంపీ రామసాయం రఘురాంరెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అనుకున్న సమయంలో పనులు జరగకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి, గుత్తేదారు కు ఫోన్ చేసి పనులు ఎంత వరకు పూర్తయ్యాయని, ఎందుకు పనులు ఆలస్యంగా నడుస్తున్నాయని ప్రశ్నించిన ఎంపి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రైల్వే స్టేషన్ పరిధిలో జరుగుతున్న పనుల పరిశీలించిన ఎంపి రఘు రాంరెడ్డి వీలైనంత త్వరలోనే పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఎంపి వెంట మాజీ జెడ్పి చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ళ మురళి, ఊకంటి గోపాల్ రావు, మాజీ ఏఎంసి చైర్మన్ రాంబాబు మరియు తదితరులు పాల్గొన్నారు.

## మాతృభూమి కోసం ప్రాణాలర్పించిన మురళి నాయక్ త్యాగాన్ని దేశమంతా గుర్తుపెట్టుకుంటుంది.

- మురళి నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య




జగ్గయ్యపేట(ప్రశ్న న్యూస్) పట్టణం, కోదాడ రోడ్డులో గల మార్కెట్ యార్డు నందు రైతులు నాయకులు తో కలిసి భారత సైన్యంలో విధులు నిర్వహిస్తూ శ్రీ సత్యసాయి జిల్లా కి చెందిన మురళి నాయక్ అనే సైనికుడు అమరుడయ్యారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మురళి నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన యం ఎల్ ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, డి సి చైర్మన్ ఏలూరి గోపాలరావు, డి సి వైస్ చైర్మన్ మన్నె నారాయణరావు, వార్డు కౌన్సిలర్ పేరం సైదేశ్వర రావు, హరి నరసింహారావు రైతులు తదితరులు పాల్గొన్నారు

# సీతారామ, సీతమ్మ సాగర్ ప్రాజెక్టు పూర్తికి ప్రణాళికలు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయనున్న సీతారామ ప్రాజెక్టు, సీతమ్మ సాగర్ మల్టిపర్పస్ ప్రాజెక్టుల పూర్తికి ప్రణాళికలు రూపొందించుకున్నామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి .ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రెండు ప్రాజెక్టులను పూర్తి చేసి 7.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ సంకల్పమన్నారు. నీటిపారుదల శాఖా కేంద్ర కార్యాలయం జలసౌధలో ఆ రెండు ప్రాజెక్టుల పురోగతి పై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి .ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీతరామ ప్రాజెక్టు కు గత ప్రభుత్వ హయాంలో నీటి కేటాయింపులు సాధించ లేక పోయిందని ఆయన తెలిపారు. కేవలం 16 నెలల వ్యవధిలో కాంగ్రెస్ ప్రభుత్వం సి.డబ్ల్యూ.సి ని ఒప్పించి 67 టి.యం.సి ల నీటిని కేటాయించుకున్నట్లు ఆయన వెల్లడించారు ప్రాజెక్టు పురోగతి పై ఆయన స్పందిస్తూ ఇప్పటికే మూడు పంప్ హౌజ్ ల నిర్మాణం పూర్తి కావడంతో పాటు నాలుగో పంప్ హౌజ్ నిర్మాణ దశలో ఉందన్నారు.మొత్తం మీద ఇప్పటికీ 97 శాతం పనులు పూర్తి అయినట్లు ఆయన వెల్లడించారు. పాలేరు లింక్ కెనాల్,సత్తుపల్లి ట్రంక్ కెనాల్,ఎన్కూరు లింక్ కెనాల్లు పురోగతిలో ఉన్నయని,భూసేకరణను పూర్తి చేయడంతో పాటు టన్నెల్ నిర్మణాలకు సంబంధించిన పర్యావరణ అనుమతులు త్వరితగతిన పొందేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నట్లు ఆయన తెలిపారు. అయితే అదే సమయంలో పనులలో జరుగుతున్న జాప్యం పై ఆయన అధికారులను సూటిగా ప్రశ్నిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించాలని ఆయన అధికారులకు సూచించారు. తదుపరి సమీక్షా సమావేశం నాటికి భూసేకరణ పురోగతితో పాటు చెల్లింపులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు సీతమ్మ సాగర్ మల్టిపర్పస్ ప్రాజెక్టుకు అవసరమైన పర్యావరణ అనుమతులు వేగవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఈ ప్రాజెక్టు కు సంబంధించి కొన్ని పనులు అనుమతులు లేకుండానే ప్రారంభించినందుకు జాతీయ హరిత ట్రిబ్యూనల్ విధించిన 53.41 కోట్ల జరిమానాను రద్దు పరిచేందుకు చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఇదే ప్రాజెక్టుకు అనుసంధానంగా నిర్మిస్తున్న 282.8 మేఘా వాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి సంబంధించిన ప్రతిపాదనలు జెన్కో కు పంపించినట్లు ఆయన తెలిపారుదుమ్ముగూడెం-పాలేరు మెయిన్ కెనాల్ పూర్తికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని,అందుకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించుకుని పనులలో వేగవంతం పెంచేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు.ఇల్లెందు మాజీ శాసనసభ్యులు గుమ్మడి నర్సయ్య ప్రతిపాదించిన ప్రతిపాదనలను పరిశీలనలోకి తీసుకుంటామన్నారు.సాధ్య సాధ్యాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవిన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నీటిపారుదల శాఖా ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,ఆర్%డ%ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, నీటిపారుదల శాఖా సలహాదయూ అదిత్యా దాస్ నాథ్,ఇ. ఎన్.సి అనిల్ కుమార్,సి.ఇ శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఉపాధి కూలి ఎంత పడుతుందో తెలియని అయోమయ పరిస్థితి

- వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్



**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని మండలం గుమ్మనూరు గ్రామంలో జరుగుచున్న ఉపాధి హామీ పనులను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులలో రోజువారి కూలి ఎంత పడుతుందో తెలియని అయోమయ పరిస్థితి, కూలీలలో నెలకొని ఉందని కూలీలు నిరాశతో పనిచేస్తున్నారని దీనికి సంబంధిత అధికారులదే బాధ్యత అని విమర్శించారు. గతంలో వారం వారం పే స్లిప్పులు ఇచ్చి వేతనాలు ఇచ్చేవారని ఇప్పుడు నెలల తరబడి వేతనాల కోసం కూలీలు వేచి చూడాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. అలాగే గతంలో వేలాదిమంది కూలీలు గ్రామాలలో ఉపాధి పనులకు వచ్చేవారని ఇప్పుడు కేవలం 100 మంది కూలీలు కూడా ఉపాధి పనులకు రావటం లేదని ఉన్నారు. చాలీచాలని వేతనాలు తీసుకుంటూ కూలీలు పనిచేస్తున్నారని కేంద్ర ప్రభుత్వం కూలీలను పొమ్మనలేక పొగ పెడుతుందని రాను రాను ఉపాధి హామీ పథకాన్ని పేద వర్గాలకు దూరం చేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు. కూలీలంతా కలిసికట్టుగా ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవడానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె పోచంతోపాటు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## స్వర్గీయ పీవీ రావు ఆశయాలను కొనసాగిస్తాం

- మాల కుల బంధావులను ఏకతాటి పైకి తీసుకువచ్చి మన హక్కుల కోసం పోరాడుతాం.
- మాల సంఘం నాయకులు ముక్క సుదర్శన్, ఎరుకల లక్ష్మణరావు పిలుపునిచ్చారు.



**మంథని ( ప్రశ్న న్యూస్)** గోదావరిఖని మెయిన్ చౌరస్తాలోనీ మాల సంఘం కార్యాలయంలో శనివారం పీవీ రావు 77వ జయంతిని ఘనంగా నిర్వహించారు. మాల సంఘం నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని పీవీ రావు చిత్రపటానికి పూలమాల వేసి,చిత్రపటం ముందు పుష్పాలను ఉంచుతూ నివాళులు ఆర్పించారు. ఈ సందర్భంగా పీవీ రావు మాల సంఘం ఏర్పాటు, మాలల హక్కుల కోసం అప్పటి ప్రభుత్వాలను ఎదిరించి పోరాడిన తీరును సంఘం నాయకులు నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా మాల సంఘం నాయకులు మాట్లాడుతూ పీవీ రావు తన జీవితాన్ని మాలల హక్కుల కోసం, మాల సంఘాన్ని ముందుకు తీసుకువెళ్లడం కోసం త్యాగం చేశారని తెలిపారు. పాలకుల చేతుల్లో ఎన్నో ఎదురుదెబ్బలు తిని మాల సంఘం ప్రతిష్ఠతను కాపాడిన వ్యక్తి పీవీ రావు అని, మాల సంఘం నాయకులంతా ఐక్యతగా ఉండి మన హక్కుల సాధన కోసం పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాల సంఘం నియోజకవర్గ అధ్యక్షులు మాలెం మధు,పట్టణ అధ్యక్షులు సోగాల వెంకటి,వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ కుమార్, ప్రధానకార్యదర్శి మర్రి ఐలయ్య, కోశాధికారి ఎరుకల లింగమూర్తి, నాయకులు ఈద రాంచందర్,పులి మోహన్, మదాసు రామ్మూర్తి,గడ్డం నారాయణ, కడమండ శ్రీహరి,,పిట్టల వెంకటి,బొమ్మక రాయలింగు, ఆరె దేవకరున, నంది నాగేశ్వర రావు,నూకల మొండి, దాసరి కిష్టయ్య,నంది నరేష్,దాసరి రమేష్, రామస్వామి,తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరగాలి

- కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్)** శనివారం రామాయణపేట మండలం అక్కన్నపేట లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్‌లి సందర్శించి కొనుగోలు కి సంబందించిన రిజిస్టర్ లను పరిశీలించారుఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యంకు తేమశాతం రాగానే కొనుగోలు ప్రక్రియ మొదలవ్వాలని.ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలని తెలిపారుకొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వివరాలు, రైతుల ఖాతా వివరాలను ఎలాంటి ఆలస్యం కాకుండ ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు అకాల వర్షాల నేపథ్యంలో ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండాలని సరిపడా టార్పాలిన్ లను,గన్ని సంచులను అందుబాటులో ఉంచుకోవాలని కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు కొనుగోలు చేసిన ధాన్యానికి అనుగుణంగా..లారీలను ముందస్తుగా అందుబాటులో ఉంచుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్ర నిర్వాహకులు, మండల తహసీల్దార్ పాల్గొన్నారు.

## కన్నుల విందుగా లంద గంగ, బోనాల సమర్పణ



**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్)** కొల్చారం ఆదిశక్తి పరాశక్తి అయిన రేణుక ఎల్లమ్మ దేవికి లంద బోనం,గంగ బోనంతో పాటు కాటమయ్య బోనాలను సమర్పించారు. శనివారం నాడు మండల కేంద్రంలోని కొల్చారంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఐదో వార్షికోత్సవం పురస్కరించుకొని ఉదయం సిద్దిపేట ఒగ్గు కళాకారులచే గ్రామ పొలిమేరలోని ఎస్సీ కాలనీలో ఉన్నటువంటి లందలోని ఉన్న అమ్మవారికి ఘటంతో పాటు ఊరేగింపుగా వెళ్లి శ్రీ రేణుక ఎల్లమ్మ కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ చివరలో ఉన్నటువంటి కోతుల చెరువు వద్దకు గంగబోనాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. ముందుగా కాటమయ్య బోనాన్ని పెద్ద గౌడ్ ఇంటి నుండి ఊరేగింపుగా డోలు చప్పులతో ఆటపాటలతో తీసుకొచ్చి కాటమయ్యకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ గౌడ్, దుర్గా గౌడ్, అశోక్ గౌడ్, రామా గౌడ్, శివకుమార్ గౌడ్, వెంకట్ గౌడ్, కృష్ణ గౌడ్, శ్రీధర్ గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, ఉపేందర్ గౌడ్, రాజేందర్ గౌడ్, దుర్గా ప్రసాద్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, పాప గౌడ్, సుధాకర్ గౌడ్, కిరణ్ గౌడ్ తదితర గౌడ సంఘ సభ్యులతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వేములవాడ నియోజకవర్గం ఆపద్బాంధవుడిగా "ఆది"

- ప్రజలకు అనునిత్యం భరోసా ఇస్తున్న నేత



**వేములవాడ, (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన వేల్పుల దుర్గయ్యకు రూ.2 లక్షల విలువగల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు మంజూరైంది.ఈ నేపథ్యంలో శనివారం వేములవాడ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వయంగా లబ్ధిదారుని ఇంటికి వెళ్లి, పట్టణ కాంగ్రెస్ నాయకుల సమక్షంలో చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా దుర్గయ్య ఆరోగ్య పరిస్థితిని ఆది శ్రీనివాస్ అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అవసరమైనప్పుడు వెంటనే స్పందించే నాయకుడిగా,వేములవాడ నియోజకవర్గం ఆపద్బాంధవుడుగా ఆది శ్రీనివాస్ నిరూపించుకుంటున్నారని పలువురు స్థానికులు అభిప్రాయపడ్డారు.

# డీలిమిటేషన్‌కు మేము వ్యతిరేకం కాదు

## – సమన్యాయమే మా డిమాండ్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలు, అనుసరిస్తున్న విధానాలు దేశానికి దిశానిర్దేశం చేస్తున్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సామాజిక న్యాయంతో పాటు ఇతర అంశాల్లో తెలంగాణ మాడల్‌ను కేంద్ర ప్రభుత్వం కూడా అనుసరించాల్సిన పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. బెంగుళూరు వేదికగా ఓ ప్రముఖ దినపత్రిక నిర్వహించిన కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. పెట్టుబడుల కోసం ప్రపంచ దేశాలు చైనా ప్లస్ వన్ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్న తరుణంలో దానిని అందిపుచ్చుకోవాలన్న ఆలోచనతో అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్టు వివరించారు. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాల అమలుతో పాటు అభివృద్ధి ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు.

### ఎలక్ట్రిక్ వాహనాలపై పన్ను రద్దు చేశాం

'మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమ ప్రభుత్వం విద్య, ఉపాధి, మౌలిక సదుపాయాల కల్పనా రంగాలపై దృష్టి సారించింది. అందులో భాగంగా అనేక వినూత్న ప్రణాళికలకు శ్రీకారం చుట్టాం. ప్రపంచ దేశాల్లోని అగ్రగామి నగరాలతో పోటీ పడాలన్నదే మా ఆలోచన'అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందులో భాగంగానే నెట్ జీరో సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశాం. దేశంలోనే మొట్టమొదటిదిగా ఫ్యూచర్ సిటీకి రూపకల్పన చేశాం. ఎలక్ట్రిక్ వాహనాలపై పన్ను రద్దు చేశాం. 360 కి.మీ మేరకు రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించడమే కాకుండా తెలంగాణలో ప్రాంతాల వారిగా పారిశ్రామికీకరణకు సన్నద్ధమయ్యాం అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

### రూ.2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను సాధించాం

'రీజినల్ రింగ్ రోడ్డు లోపలి పరిధిలో పరిశ్రామిక పార్కులు, ఐటీ, ఎలక్ట్రిక్ వాహనాలు, అటోమొబైల్ ఇండస్ట్రీ, ఇతర పరిశ్రమలను ఆకర్షించే విధంగా మౌలిక సదుపాయాల కల్పించాలన్నదే ప్రయత్నం. డ్రైపోర్టు నిర్మాణం వంటి అనేక ప్రణాళికలకు రూపకల్పన చేశాం'అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'రాష్ట్రానికి 2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను సాధించాం. ఇవన్నీ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చుతాయి. మా ప్రభుత్వం సహేతుకమైన ప్రణాళికలతో పెట్టుబడులను ఆకర్షించేందుకు, పరిశ్రమలు, ఐటీ కంపెనీలు, ఇతర రంగాలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తుంది. ప్రతి అంశాన్ని అందిపుచ్చుకుంటూ ముందుకు వెళ్లాలన్నదే ప్రయత్నం. ఇటీవల జపాన్ దేశ పర్యటన సందర్భంగా తెలుసుకున్న విషయాల మేరకు ఆ దేశానికి అవసరమైన మానవ వనరులను సమకూర్చడానికి వీలుగా తెలంగాణలో జపనీస్ భాషను నేర్పించాలని సంకల్పించాం'అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

### తెలంగాణ రైజింగ్ మొదలైంది

'తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య ఉద్యోగ, రాజకీయ సర్వే దేశానికి ఒక మోడల్‌గా నిలిచింది. ఈ సర్వే సమాజాన్ని మరింత సమర్థవంతంగా గుర్తించి సేవలు అందించడంలో దోహదపడుతుంది. ఇది కేవలం బీసీల కోసమే కాదు. ఈ సర్వే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ ప్రజలకూ ఉపయోగపడుతుంది'అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు తెలంగాణ ముందడుగు వేసింది. కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ మాడల్‌ను అమలు చేయాలి. ఈ రకంగా అనేక కోణాల్లో తెలంగాణ రైజింగ్ మొదలైంది'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

### రైతులకు ఏటా 12 వేలు ఇన్ పుట్ సబ్సిడీ

'తెలంగాణలోని వేర్వేరు రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఐసొలేషన్ గా సాగుతున్న విద్యను ఇంటిగ్రేట్ చేయడం ద్వారా పిల్లల్లో సోషలైజేషన్ ప్రక్రియకు చేపట్టాం. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఒక కీలకమైన నిర్ణయం'అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. 'జనాభాలో దాదాపు 60 శాతం ఉన్న వ్యవసాయ కుటుంబాలకు అండగా ఉండేందుకు అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే రాష్ట్రంలో 25 లక్షలకు పైగా రైతులకు 21,617 కోట్ల రూపాయల మేరకు రుణమాఫీ చేశాం. రైతులకు ఏటా 12 వేలు ఇన్ పుట్ సబ్సిడీగా ఇస్తున్నాం. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. దేశంలోనే అత్యధికంగా వరి ఉత్పత్తి చేసే రాష్ట్రం కనీస మద్దతు ధరతో పాటు క్వింటాల్ కు రూ. 500 బోనస్ చెల్లిస్తున్నాం'అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### 59వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చాం

'అలాగే 67 లక్షల సభ్యులున్న స్వయం సహాయక సంఘాల మహిళలకు వెయ్యి మెగావాట్ల సోలార్ ఉత్పత్తిని అవకాశం, పాఠశాలల నిర్వహణ, యూనిఫామ్ వంటి బాధ్యతలన్నీ వారికే అప్పగించాం. ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం'అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. 'అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 59 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. నిరుద్యోగ యువతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ అనేక నిర్ణయాలు తీసుకున్నాం. స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, టాటా టెక్నాలజీస్ సహకారంతో రాష్ట్రంలోని 105 ఐటీఐలను ఏటీసీలుగా మార్చుతున్నాం. ఇవన్నీ యువతకు ఉద్యోగ అవకాశాలు, ఉపాధి మార్గాలను చూపించడంలో భాగంగా చేపట్టాం'అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

### డీలిమిటేషన్‌కు మేము వ్యతిరేకం కాదు

'డీలిమిటేషన్‌కు మేము వ్యతిరేకం కాదు. కానీ ముందు కేంద్ర ప్రభుత్వం ఆ ప్రక్రియకు సంబంధించి అన్ని పార్టీలతో సంప్రదింపులు జరిపి అందుకు ప్రాతిపదికను స్పష్టంగా వెల్లడించాలి. అన్ని రాష్ట్రాలకు సమన్యాయం కావాలన్నదే మా డిమాండ్. అభివృద్ధి సాధిస్తున్న రాష్ట్రాలను శిక్షించకూడదు. ఇది సామాజిక, రాజకీయ న్యాయానికి సంబంధించిన అంశం. అందుకే చర్చ జరగాలని అడుగుతున్నాం'అని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. 'మొదటగా నేను భారతీయ సైన్యానికి సెల్యూట్ చేస్తున్నాను. దేశాన్ని రక్షించడంలో అహర్నిశలు కృషి చేస్తున్నారు. దేశ రక్షణ కోసం నిరంతరం కాపలాకాస్తోంది. ఈ సమయంలో అందరం సైనికులకు మద్దతు తెలపాలి' అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# తెలంగాణ విజయ డైరీలో ఇంటి దొంగలా..?

- స్టాపింగ్ ప్యాటన్ నిబంధనలు చేయడానికి లక్షల్లో వసూళ్లట
- ఉద్యోగులు ,ఉద్యోగ సంఘాల నేతల గుసగుసలు
- రోజురోజుకు పడిపోతున్న విజయ డైరీ పాల అమ్మకాలు
- తెలంగాణ విజయ డైరీ బాగుపడేది ఎట్లా.? బాగుపరిచేది ఎవరు.?

**తార్నాక (ప్రశ్న న్యూస్)** తెలంగాణ విజయ డైరీలో అవినీతి అక్రమాల పరంపర కొనసాగుతుంది. ఇప్పటివరకు కొంతమంది అధికారులు సిబ్బంది కలిసి విజయ డైరీ ని నష్టాల బాటలో నడపడంతో పాటు అందిన కాడికి దండుకోవడం ఇక్కడ సర్వసాధారణంగా మారింది. కొంతమంది ఉన్నత అధికారులు కూడా విజయ డైరీని తమ స్వార్థం కోసం ఉపయోగించుకుంటూ కోట్లు గడించారని దానితోపాటు సంస్థకు కన్నం పెట్టి సంస్థను దివాలా తీయించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుణ్యమా అంటూ 100 కోట్లు ఇవ్వడంతో ఈరోజు తెలంగాణ విజయ డైరీ నడుస్తోంది లేకుంటే ఇప్పటివరకు పూర్తిగా లాక్ అవుట్ అయ్యేది. అయితే అధికారులు పాల అమ్మకాలను పెంచకుండా తగ్గించుకుంటూ వస్తూ ప్రైవేట్ డైరీలతో అంతర్గత ఒప్పందాలు చేసుకొని విజయ డైరీని పూర్తిగా నష్టాల వైపు నెట్టివేశారు. ఈ డైరీ ని ఉన్నత స్థితికి తీసుకురావాలని ఒక్క అధికారికి కూడా చిత్తశుద్ధి లేకపోవడంతో విజయ డైరీ పూర్తిగా నష్టాల వైపు నడుస్తుంది. ముఖ్యంగా ఇందులో పనిచేసే అధికారులు, సిబ్బంది బాధ్యతారాహిత్యం తో పాటు విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం ఇందుకు నిదర్శనంగా మారింది. లాలాపేటలో దాదాపు 5 లక్షల పైనే సామర్థ్యం ఉన్న విజయ డైరీ నీ అభివృద్ధి చేయకుండా కేవలం ఇక్కడ 2,40,000 లీటర్ల పాలనే ఉత్పత్తి చేస్తున్నారు. దీనికి సరిపోదు అన్నట్టు మెగా డైరీ పేరుతో గతంలో ప్రైవేటు స్థలంలో లీజు తీసుకొని 5 లక్షల లీటర్ల కెపాసిటీ అంటూ బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త డైరీ ని ప్రారంభించడం హాస్యస్పదంగా మారింది. ఉన్న డైరీలో ఉత్పత్తి పూర్తి సామర్థ్యంతో చేయకుండా కొత్త డైరీ ని ఏర్పాటు చేయడం వెనుక భారీ స్థాయిలో అవినీతి అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. అప్పుడు మంత్రిగా ఉన్న తలసాని శ్రీనివాస్ యాదవ్ నిర్లక్ష్యం వల్ల ఈరోజు విజయ డైరీ పూర్తి నష్టాలకు కారణమన్న ఆరోపణలు ఉన్నాయి వాళ్ల బంధువులు సైతం ఇందులో తిష్ట వేసి దివాలా తెగించరన్న ఉద్యోగ సంఘాలు ఆరోపణలు ఉన్నాయి. దానికి తోడు ప్రస్తుతం అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్టాపింగ్ ప్యాటన్ నియమ నిబంధనలు చేయడానికి దాదాపు 12 లక్షల వరకు ఖర్చు అవుతుందని కానీ దీని వెనుక కొంతమంది అధికారులు తమ స్వవ లాభం కోసం 16 లక్షల వరకు బిల్ చేసినట్లు ఉద్యోగులలో గుసగుసలు వినిపిస్తున్నాయి. విజయ డైరీలో కొంతమంది అధికారులు లక్షలలో అవినీతి అక్రమాలకు పాల్పడడంతో పాటు డైరీని దివాలా తీసే విధంగా తమ విధులు నిర్వహిస్తున్నారని గతంలో కూడా చాలామంది అధికారులు చైర్మన్, ఎండిలు డైరీని గాలికి వదిలేసి అందిన కాడికి దోచుకుంటున్నారని ఎండిగా ఐఏఎస్ స్థాయి అధికారులు ఉండి కూడా విజయ డైరీని నిర్లక్ష్యంగా వదిలివేయడం విడ్డూరంగా మారింది. ఐఏఎస్ అధికారులు కూడా బాధ్యతారాహిత్యంగా విధులు నిర్వహించడంతోనే విజయ డైరీ నష్టాల వైపు నడుస్తుందని పూర్తిస్థాయిలో ఎండీలు విధులు నిర్వహించలేక విజయ డైరీ ని నష్టాలకు గురి చేస్తున్నారని ఇదే అదనుగా నాసిరకంగా పాలు పాల ఉత్పత్తులు సరఫరా అవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. విజయ పాలు ఎంత సురక్షితం అన్నదానిపై అధికారులు కూడా పూర్తిస్థాయిలో ప్రచారం చేయడం లేదు ప్రైవేటు డైరీ ఫారం లకు అధికారులు బినామీలుగా వ్యవహరిస్తున్నారన్న గుసగుసలు ఉన్నాయి. ఏది ఏమైనా అధికారులకు ఉద్యోగులకు అన్నం పెట్టే ప్రభుత్వ సంస్థలను నిలువునా మోసం చేస్తూ వాళ్ళ స్వార్థం కోసం పక్కదారులలో కోట్లు సంపాదించుకుంటున్న అవినీతి అధికారులు సిబ్బంది ఉన్నంతవరకు పరిస్థితి ఇలాగే ఉంటుందని ఉద్యోగ సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పాకిస్థానీలు అధికారిక బిచ్చగాళ్లు.. అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) :** మతాన్ని అడ్డం పెట్టుకొని భారత్‌పై ఉగ్రవాదాన్ని ఉసిగొల్పుతున్న పాకిస్థాన్‌కు అసలు ఇస్లాం పదాన్ని ఉచ్చరించే అర్హత కూడా లేదని ఏఐఎంఐఎం అధినేత అసద్దీన్ ఒవైసీ ధ్వజమెత్తారు. అమాయకులను, పిల్లలను చంపాలని ఏ ఇస్లాం బోధిస్తున్నదని పాకిస్థాన్‌ను సూటిగాప్రశ్నించారు. టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఉర్దూ జర్నలిస్టుల అవార్డుల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ముస్లింలు తమ మాతృభాషగా చెప్పుకొనే ఉర్దూకు పాకిస్థాన్‌లో ఇంతవరకు అధికార భాష హోదా కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేవలం ఏడు శాతం మందే అక్కడ ఉర్దూ మాట్లాడుతుండగా, 40శాతం మంది పంజాబీ, మిగిలినవారు ఇతర భాషలు మాట్లాడుతున్నారని చెప్పారు. భారత్‌లో ఉర్దూకు అధికారభాష హోదా ఉన్నదని గుర్తుచేశారు. పాకిస్థాన్ వాళ్లు భారత ముస్లింలను తక్కువ చేసి చూస్తారని, సాటి ముస్లింను తమతో సమాన పౌరుడిగా భావించని పాకిస్థాన్‌కు ఇస్లాంను ఉచ్చరించే అర్హత లేదని స్పష్టంచేశారు. మతం పేరుతో లుంబినీ పార్క్, గోకుల్ చాట్, దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాల్లో బాంబు దాడులకు పాల్పడ్డారని, ఉగ్రవాదులను భారత్‌లోకి పంపి ఇక్కడ అశాంతి సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అక్కడి జమాతే ఇస్లామీ పాకిస్థాన్ అనే సంస్థకు చైనా కమ్యూనిస్టు పార్టీతో ఒప్పందం ఉన్నదని, అసలు ఇస్లాంకు, కమ్యూనిస్టులకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. పహల్గాంలో మహిళల ఎదటే వారి కుటుంబీకులను పొట్టనబెట్టుకోవడం ఏమిటని? ఏ ఇస్లాం ఇలాంటివి బోధిస్తున్నదని నిలదీశారు. పాకిస్థానీలు అధికారిక బిచ్చగాళ్లని, ఒక బిలియన్ డాలర్ అప్పుకోసం ఐఎంఎఫ్‌కు వెళ్లారని దెప్పిపొడిచారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు..

## – ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు.



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** అశ్వరావుపేట నియోజకవర్గం లో సుమారు 37.64 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న 33 KV విద్యుత్ ఉప కేంద్రాల శంకుస్థాపన అనంతరం అశ్వరావుపేట నియోజకవర్గం జిల్లా అధికారులతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార,పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురామ రెడ్డి ,అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, వైరా శాసనసభ్యులు రామదాస్ నాయక్ ,జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఐ టిడిఏ పి ఓ రాహుల్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు కమలాపురం సబ్ మరియు అంకంపాలెం లో 130 కె వి సబ్ స్టేషన్ కూడా మంజూరు చేస్తే అశ్వరావుపేట నియోజకవర్గంలో విద్యుత్ కు ఎటువంటి అంతరాయం ఉండదని విద్యుత్ ఉపకేంద్రాల ఏర్పాటుకు అనువైన స్థలం కూడా ఉన్నదని అధికారులు వివరించారు దానికి గాను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు స్పందించి వెంటనే సబ్ స్టేషన్ల ఏర్పాటు ,అశ్వరావుపేట నియోజకవర్గం లో డివిజన్ విద్యుత్ శాఖ కార్యాలయం ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలని సీఎండీని ఆదేశించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ... మారుమూల ప్రాంతమైన గిరిజనులు అధికంగా నివసించే అశ్వరావుపేట నియోజకవర్గం అభివృద్ధికి కావలసిన మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని దానిని అధికారులు క్షేత్రస్థాయిలో ప్రతి కుటుంబానికి తీసుకు వెళ్ళగలిగితే ప్రభుత్వం విజయం సాధించినట్టే అన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి చేపడుతున్న ప్రతి సంక్షేమ పథకాన్ని క్షేత్రస్థాయిలో తీసుకెళ్లే బాధ్యత ప్రతి అధికారి మీద ఉందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు తీసుకువెళ్లడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన నిర్ణయాలు తీసుకుంటామని హెచ్చరించారు. మూడున్నర కోట్ల మంది ప్రజలకు హామీలు ఇచ్చి ప్రభుత్వం ఏర్పడిందని వాళ్ల నమ్మకాన్ని వాళ్ళ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అందరి మీద ఉందన్నారు. ఉద్యోగస్తుల సమస్యలను కూడా రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఆలోచనలో ఉందని, ఉద్యోగస్తుల సమస్యలను కూడా కొద్ది రోజుల్లో పరిష్కరిస్తామన్నారు.

# ఉగ్రవాదంపై పోరాటంలో రష్యా పూర్తి మద్దతు: భారత్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఉగ్రవాదంపై భారత్ సాగిస్తున్న పోరాటానికి తమ పూర్తి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని రష్యా మరోసారి స్పష్టం చేసింది. ఇరు దేశాల మధ్య గతంలో కుదిరిన ఒప్పందాల మేరకు ద్వైపాక్షిక సహకారం నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపింది. ఈ నేపథ్యంలో, చర్చల దశలో ఉన్న సైనిక ఆర్డర్లను వీలైనంత త్వరగా భారత్‌కు అందజేస్తామని హామీ ఇచ్చింది. భారత రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్ మాస్కో పర్యటన ముగించుకుని భారత్‌కు తిరిగి వస్తున్న సందర్భంగా మీడియాతో ఈ విషయాలను పంచుకున్నారు. "వివిధ రూపాల్లోని ఉగ్రవాదంపై మేము చేస్తున్న పోరాటానికి రష్యా పూర్తి అండగా నిలుస్తుందని హామీ ఇచ్చింది. ఇప్పటికే అమల్లో ఉన్న ఒప్పందాలకు అనుగుణంగా ఇరు దేశాల మధ్య సహకారం కొనసాగుతుంది" అని సంజయ్ సేథ్ పేర్కొన్నారు. మాస్కోలో జరిగిన ప్రతిష్ఠాత్మక విక్టరీ డే పరేడ్‌లో భారత ప్రతినిధిగా సంజయ్ సేథ్ పాల్గొన్నారు. అనంతరం, ఆయన రష్యా రక్షణశాఖ సహాయ మంత్రి అలెగ్జాండర్ ఫోమిన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో ఇరు దేశాల మధ్య రక్షణ, సైనిక-సాంకేతిక సహకారం సహా పలు కీలక అంశాలపై విస్తృత చర్చలు జరిపారు. గతంలో రూపొందించుకున్న నియమావళికి కట్టుబడి, నిరంతర సంప్రదింపుల ద్వారా ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరుపక్షాలు ఈ సందర్భంగా అంగీకారానికి వచ్చాయి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588